# బంగారుకవచంలో బంగారుదేవుడు

**-ఏడాదంతా పునర్దర్శనం**





తిరుమల, జూన్ 11ప్రభాతవార్తప్రతినిధి: శ్రీవేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులు శ్రీదేవిభూదేవిసమేత మలయప్పస్వామి ఉత్సవర్లు అరిగిపోకుండా జరిపించే జ్యేష్టాభిషేకం బుధవారం మధ్యాహ్నం వేడుకగా ముగిసింది. బుధవారం మధ్యాహ్నం ముత్యపుకవచాన్ని తొలగించి స్వర్ణకవచాలను తొడిగారు. ఏడాది పూర్తిగా ఉయదేవేరులతో కలసి మలయప్పస్వామి బంగారుకవచంలోనే సేవల్లో స్నపనతిరుమంజనాలు, నిత్యకైంకర్యాలు అందుకుంటారు. సాయంత్రం సహస్రదీపాలంకారసేవలోనూ, మాఢవీధుల్లో ఊరేగింపులో శ్రీదేవిభూదేవిసమేత మలయప్పస్వామి బంగారుకవచంలోనే భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమాల్లో పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి దంపతులు, బోర్డుసభ్యురాలు సుచిత్ర ఎల్ల, ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాధం, ఆలయ పేష్కార్ రామకృష్ణ ,గృహస్థభక్తులు పాల్గొన్నారు.

తిరుపతి - చిత్తూరు


తెలుగు జాతీయ దినపత్రిక
వార్త


### నేటి నుండి రాంప్, మండీల ద్వారా

# తోతాపురి కొనుగోలు

**- రాంప్, ట్రేడర్స్, మండీలు మార్కెటింగ్ ఏడి వద్ద రిజిస్ట్రేషన్**
**- కలెక్టర్ సుమిత్‌కుమార్**



చిత్తూరు, జూన్ 11 ప్రభాతవార్త:
రాంప్, ట్రేడర్లు, మండీల వారు గురువారం నుండి తోతాపురి మామిడి కొనుగోలు చేయవచ్చునని కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశభవనంలో బుధవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, ఉద్యానశాఖ డిడి మధుసూధన్‌రెడ్డిలతో కలిసి రాంప్, మండీల ద్వారా మామిడి కొనుగోలు అంశాలపై రాంప్, మండీల వ్యాపారస్తులు, ఉద్యానశాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ గురువారం నుండి రంప్, మండీల వారు మామిడి కొనుగోలు చేసుకోవచ్చునని, అయితే రాంప్, మండీ వ్యాపారస్తులు తప్పనిసరిగా మార్కెటింగ్ ఏడి వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఇలా రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారు మాత్రమే మామిడికాయలు కొనుగోలు చేయవచ్చునన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తోతాపురి మామిడికి మద్దతు ధర ప్రకటించిన దీనిని పూర్తి స్థాయిలో రైతులకు న్యాయం జరిగేలా రాంప్, మండీల వ్యాపారస్తులు సహకారం అందించాలన్నారు. రాంప్, మండీల వారు ఏ రైతు నుండి ఎన్ని టన్నుల మామిడి కొనుగోలు చేశారు! రైతు పేర్లు, మామిడి కాయ లారీలు ఏ కంపెనీకి లేదా ఇతర రాష్ట్రాలకు వెళ్తున్న అంశాలు, ప్రాసెసింగ్ కంపెనీల వద్ద షిఫ్ట్‌ల వారీగా విధులు నిర్వహిస్తున్న ఇన్‌ఛార్జీలను నియామకం చేయడం జరుగుతుందన్నారు. ఇందులో ఒకరు తప్పనిసరిగా ఆర్ఎస్‌కె ఇన్‌ఛార్జీ వున్న సమయంలో ఆ ప్రాసెసింగ్ కంపెనీ వద్దకు అందిన రైతుల పూర్తి వివరాల్లో గ్రామం, మండలం, వాహనం నెంబరు, క్వాంటిటీ, ఆధార్ నెంబర్, బ్యాంకు ఖాతా వివరాలు సంబంధిత ఫోన్ నెంబర్లను ప్రొఫార్మా నందు పూర్తి వివరాలను ప్రాసెసింగ్ కంపెనీల వద్ద పర్యవేక్షణను నియామకం కాబడ్డ ఉద్యాన, వ్యవసాయ, ఏపిఎంలు, ఏపిఓలు నమోదు చేయాలన్నారు. ప్రాసెసింగ్ కంపెనీలు కేజీ తోతాపురి మామిడికి రూ.8, రాష్ట్ర ప్రభుత్వం తరపున రైతులకు ప్రోత్సాహకంగా కేజీకి రూ..4 అందించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో ర్యాంప్, మండీ వ్యాపారస్తులు మాట్లాడుతూ లారీలు, అద్దెలు, కూలీల రేట్లు అధికంగా వున్నాయని, దానికి అనుగుణంగా రేటు ఇవ్వాలని కలెక్టర్‌ను కోరారు. దీనిపై కలెక్టర్ మాట్లాడుతూ రాంప్, మండీ వ్యాపారుల సమస్యలను నోట్ చేసుకున్నామని, లారీల అద్దెలు, కూలీల రేట్లకు సంబంధించి సమీక్షించిన అనంతరం మళ్ళీ ఒకసారి రాంప్, మండీ వ్యాపారస్తులతో చర్చిస్తామన్నారు. ఈ సమావేశంలో మార్కెటింగ్ ఏడి పరమేశ్వర్‌రెడ్డి, ఉద్యానశాఖ అధికారులు, రాంప్, మండీల వ్యాపారస్తులు, ఇతరులు పాల్గొన్నారు.

# అభివృద్ధిలో భారత్ త్వరలో అగ్రస్థానం

**-ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కేంద్రం పూర్తిసహకారం**
**-తిరుపతిలో కేంద్రమంత్రి బండిసంజయ్**



తిరుపతిలో మొక్కలునాటుతున్న కేంద్రమంత్రి

తిరుపతి, జూన్ 11ప్రభాతవార్తప్రతినిధి:
భారతప్రధానిగా నరేంద్రమోదీ సత్తాఏంటో గత 11సంవత్సరాలలో దేశప్రజలు గమనించారని, అభివృద్ధి,సంక్షేమం,దేశభక్తి మోదీ పాలనలో కనిపిస్తున్నాయని కేంద్రహోంశాఖ సహాయ మంత్రి బండిసంజయ్ తెలిపారు. మోదీ పాలనపై ప్రపంచ వ్యాప్తంగా చర్చ జరుగుతోందని,ప్రపంచంలోనే అభివృద్ధిచెందిన దేశాలలో భారత్ ప్రస్తుతం 4వస్థానంలో ఉందని, త్వరలో అగ్రస్థానంలో నిలబడతామని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. కేంద్రప్రభుత్వ పథకాలతో కోట్లాదిమంది నిరుపేదలు లబ్ధిపొందుతున్నారని, గరీబ్ కళ్యాణ్,అన్నయోజన, పిఎం ఆవాస్‌యోజన, జన్‌ధన్‌అకౌంట్స్,ఆయుష్మాన్‌భారత్,స్వనిధి, ముద్రయోజన,స్టార్టఫ్ ఇండియా వంటి పథకాలను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకుంటున్నారని అన్నారు. కేంద్రం హోంశాఖ సహాయమంత్రి హోదాలో తొలిసారిగా బుధవారం ఉదయం తిరుపతికి విచ్చేసిన బండి సంజయ్ మధ్యాహ్నం ఓ సమావేశపు హాల్‌లో తిరుపతి జిల్లా బిజెపి నాయకులు, కార్యకర్తలతో కలసి సుదీర్ఘంగా మోదీ పాలనపై చర్చించారు. ఇక్కడ గత 11సంవత్సరాల ప్రధాని మోదీ పాలనలో దేశంలో జరిగిన అభివృద్ధి, పలు ప్రాజెక్టులు నిర్మాణం,రాష్ట్రానికి వచ్చిన నిధులు, కొత్త ప్రాజెక్టులుపై ఏర్పాటుచేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను బండి ఆసక్తికరంగా తిలకించారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందని, రాష్ట్రానికి అవసరమైన నిధులను కేటాయిస్తున్నామన్నారు.మోదీ పాలనలో దేశం స్వర్ణయుగం వైపు పరుగులుతీస్తోందన్నారు. పేదలకు సంక్షేమపాలన 11సంవత్సరాలు పూర్తిచేసుకుందన్నారు. నారీశక్తికి మరింత ప్రోత్సహం కల్పిస్తామని, పేదబడుగు బలహీన వర్గాలకు ఎన్నో సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలుచేస్తున్నారన్నారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కోట్లాదిమంది పేదల కుటుంబాల్లో ,ప్రజల జీవితాల్లో వెలుగులునింపిన ఘనత నరేంద్రమోదీకి దక్కుతుందన్నారు. వికసిత్‌భారత్‌తో అగ్రరాజ్యాలకు ధీటుగా పోటీపడుతూ భారతదేశంలో బిజెపి సుపరిపాలన అందిస్తున్నదని బండి ఉద్ఘాటించారు. అంతకుముంతు తిరుపతికి వచ్చిన ఆయనకు బిజెపి రాష్ట్రకార్యదర్శులు,టిటిడి బోర్డు మెంబర్ జి.భానుప్రకాశ్‌రెడ్డి, కోలా ఆనంద్, తిరుపతి జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, జిల్లా సాంస్కృతిక విభాగం కన్వీనర్ గుండాల గోపీనాధరెడ్డి, రాటకొండ విశ్వనాథ్, భాస్కర్, వరప్రసాద్, బిజెపి నేత నవీన్‌కుమార్‌రెడ్డి,సుబ్రమణ్యంయాదవ్ తదితరులు ఘనస్వాగతం పలికారు,

**-పోలీస్‌గ్రౌండ్‌లో మొక్కలునాటిన కేంద్రమంత్రి:**
ప్రధాని నరేంద్రమోదీ పిలుపుమేరకు ఏక్ పేడ్ మాకే నామ్ అనే స్ఫూర్తితో దేశవ్యాప్తంగా మొక్కలునాటే కార్యక్రమం చేపడుతున్నామన్నారు. తిరుపతి పర్యటనలో తాను తిరుపతి పోలీసు గ్రౌండ్‌కు చేరుకుని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజుతో కలసి మొక్కలు నాటడం మరచిపోలేనిదన్నారు. విద్యార్థులు,యువత అందరూ కలసికట్టుగా మొక్కలునాటి పచ్చదనం పెంపొందించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా తిరుపతి నగర పరిరక్షణ, భద్రత,ప్రశాంతతకు, నేరస్థుల కట్టడికి అధునాతన డ్రోన్ నిఘా వ్యవస్థ గురించి ఎస్పీ కేంద్రమంత్రికి వివరించారు.

# సన్నబియ్యంతో మధ్యాహ్నం భోజనం

**- తిరుపతి జిల్లా సంయుక్త కలెక్టర్ శుభం బన్సల్**

తిరుపతి కలెక్టరేట్, జూన్ 11 ప్రభాతవార్త ః
తిరుపతి జిల్లాలో పాఠశాలలు, హాస్టళ్ళల్లో మధ్యాహ్న భోజన పథకానికి సన్నబియ్యం ఆర్ అండ్ ఆర్ రకంతో నాణ్యతగా పిల్లలకు మంచి ఆహారాన్ని అందించే గొప్ప కార్యక్రమం చేపడుతున్నామని బియ్యం క్యూఆర్ కోడ్‌తో పక్కదారి పట్టకుండా చర్యలు చేపడుతున్నామని జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ పేర్కొన్నారు. జేసీ మాట్లాడుతూ ప్రభుత్వం వారి కేటాయింపుల ప్రకారం తిరుపతి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు, ప్రభుత్వ హాస్టల్స్‌కు సన్నరకం సైన్ వెరైటీ బియ్యంను (బీపీఎల్ రకం) 25 కేజీల ప్యాకింగ్ చేసి సరఫరా చేయుటకు ఏర్పాటు చేయడమైనదన్నారు. జిల్లాలోని 1867 పాఠశాలలకు 7614 ప్యాకెట్లు, ప్రభుత్వ హాస్టళ్ళకు 9400 ప్యాకెట్లు, తిరుపతిలోని ఇస్కాన్ వారి ద్వారా మధ్యాహ్న భోజన పథకంనకు 3377 ప్యాకెట్లు, అక్షయ పాత్ర ద్వారా మధ్యాహ్న భోజన పథకంనకు 1353 ప్యాకెట్ మొత్తంగా 21744 ప్యాకెట్లు జిల్లాలోని స్కూళ్ళకు, ప్రభుత్వ హాస్టల్స్‌కు చేరవేయడం జరిగిందని తెలిపారు.

# గరుడ వాహనంపై గోవిందుని విహారం

**వైభవంగా ప్రసన్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు**




ఉదయం మోహినీ రూపంలో, రాత్రిగరుడ వాహనంపై విహరిస్తున్న గోవిందుడు

వడమాలపేట, జూన్ 11 ప్రభాతవార్త :
మండలంలోని అప్పలాయగుంటలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం తనకు అత్యంత ప్రీతి పాత్రమైన గరుడ వాహనంపై విహరిస్తున్న గోవిందుని భక్తులు తిలకించి పులకించారు. వేద మంత్రోచ్ఛారణలు, మేళతాళాల నడుమ స్వామి వారి గరుడ వాహన సేవ అత్యంత వైభవంగా జరిగింది. వేకువజామున 4 గంటలకు సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపిన అర్చకులు నిత్య కైంకర్యాలు భేరితాడనం, భేరి పూజ, ధ్వజపటం, నవసంధి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తుల సర్వదర్శనం అనంతరం ఉదయం 7 గంటలకు స్వామివారు మోహినీ రూపంలో అలంకృతుడై పల్లకీల్లో కొలువుదీరి మాడ వీధుల్లో విహరించారు. దేవదానవులకు అమృతం పంచిపెట్టేందుకు శ్రీ మహావిష్ణువు మోహినీ రూపంలో అవతరించారట. భక్తజన వల్లభుడన శ్రీవారు మోహినీ రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. వాహనానికి ముందు భక్తులు కోలాటాలు, భజనలతో ఆడుతూ, పాడుతూ స్వామివారి సేవలో తరించారు. తొమ్మిది గంటలకు తిరిగి వాహన మండపం చేరుకున్న స్వామివారితో పాటు అమ్మవార్లకు వేడుకగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, కొబ్బరి నీళ్లు, పసుపు, చందనాలతో విగ్రహాలకు అభిషేకం చేశారు. సాయంత్రం 5.30 నుంచి 6.30 గంటల వరకూ నిర్వహించిన ఊంజల్ సేవలో శ్రీవారు ఉభయ దేవేరులతో కొలువుదీరి చిద్విలాసంగా ఊయల ఊగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. గరుడ వాహనం సందర్భంగా టిటిడి అధికారులు తిరుమల నుంచి లక్ష్మీకాసుల హారాన్ని తీసుకువచ్చి పూజలు నిర్వహించి మాడ వీధుల్లో ఊరేగించారు. రాత్రి 7.00 గంటలకు స్వామివారు వాహన మండపం చేరుకున్నారు. స్వామి వారి గరుడ వాహన సేవను తిలకించేందుకు వేలాది మంది భక్తులు తరలిరావడంతో అప్పలాయగుంట భక్త జనంతో నిండిపోయింది. 7.30 గంటలకు మలయప్ప సర్వాలంకార భూషితుడై, సర్వాంగ సుందరంగా అలంకరించిన గరుడ వాహనాన్ని అధిరోహించారు. భక్తుల గోవిందనామ స్మరణల మధ్య ముందుకు సాగారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారుల ప్రదర్శనలు, కోలాటాలు, నృత్యాలు, వాయిద్యాలతో అప్పలాయగుంట మార్మోగింది. మాడ వీధుల్లో అందంగా రంగవల్లులు తీర్చిదిద్దిన స్థానిక భక్తులు అడుగడుగునా స్వామివారికి కర్పూర హారతులు, నారికేళాలు సమర్పిస్తూ భక్తిని చాటుకున్నారు. రాత్రి 9 గంటలకు తిరిగి వాహన మండపం చేరుకున్న స్వామివారికి ఏకాంత సేవ జరిగింది. కార్యక్రమాల్లో టిటిడి డిప్యూటీ ఇఒ హరీంధ్రనాథ్, ఎఇఒ దేవరాజులు, సూపరింటెండెంట్ శ్రీవాణి, ఆలయాధికారి శివకుమార్, ప్రధాన అర్చకుడు సూర్యకుమారాచార్యులు, కంకట బట్టర్ తిప్పయాచార్యులు, రమణాచార్యులు, వేదపండితులు, టిటిడి సిబ్బంది పాల్గొన్నారు.

# ఎర్రచందనం ముద్దాయిపై పీడీ యాక్ట్

**- ఉక్కుపాదం మోపుతున్న టాస్క్ ఫోర్స్**



తిరుపతి కార్పొరేషన్, జూన్ 11, ప్రభాతవార్త
ఎర్రచందనం అక్రమ రవాణాకు చెందిన పలు కేసుల్లో ముద్దాయిగా ఉన్న తమిళనాడుకు చెందిన అజిత్ బాబు ఎలియాస్ అజిత్ పై టాస్క్ ఫోర్స్ అధికారులు పీడీ యాక్ట్ అమలు చేశారు. టాస్క్ ఫోర్స్ హెడ్ ఎల్. సుబ్బారాయుడు ప్రత్యేక కార్యాచరణ అములులో భాగంగా టాస్క్ ఫోర్స్ ఎస్పీ పీ శ్రీనివాస్ అధ్వర్యంలో ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధించడమే కాకుండా, నమోదైన కేసులను నిరూపించే విధంగా దర్యాప్తు చేపడుతున్నారు. ఇందులో భాగంగా గత ఐదేళ్లుగా 10కంటే ఎక్కువ కేసుల్లో ఎర్రచందనం అక్రమ రవాణా వృత్తిగా చేసుకుని, ముఠాగా ఏర్పడి స్మగ్లింగ్‌కు పాల్పడుతున్న అజిత్ బాబు ఎలియాస్ అజిత్ (22)పై పీడీ యాక్ట్ అమలుకు టాస్క్ ఫోర్స్ హెడ్ ఎల్. సుబ్బారాయుడు సిఫారసు చేశారు. ఈ మేరకు తిరుపతి జిల్లా కలెక్టరు, జిల్లా మెజిస్ట్రేట్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్, అతనిపై పీడీ యాక్ట్ అమలుకు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ వ్యక్తి ఎర్రచందనం కొల్లగొట్టడుతూ, వన్య మృగాల చట్టాలను ఉల్లంఘించి నేరాలు చేస్తూ ప్రజాజీవనానికి అటంకం కలిగిస్తున్నట్లు గుర్తించారు. పీడీ యాక్ట్ అమలులో భాగంగా నిందితుడిని కడప సెంట్రల్ జైలుకు తరలించారు. ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధకంలో భాగంగా పీడీ యాక్ట్ అమలు చేయడానికి వెనుకాడబోమని టాస్క్ ఫోర్సు ఎస్పీ పీ.శ్రీనివాస్ హెచ్చరించారు. ఎర్రచందనం కేసుల్లో ఇప్పటికే అనేక మందికి శిక్షలు పడ్డాయని గుర్తు చేశారు. యువత ఎర్రచందనం అక్రమ రవాణాకు ప్రయత్నించి వారి భవిష్యత్తును పాడు చేసుకోవద్దని చెప్పారు. స్మగ్లర్లకు శిక్ష పడటంతో పాటు వారి ఆస్తులు కూడా జప్తు చేసుకో పడతాయని తెలియజేసారు.

# ఎస్వీయూలో సామాగ్రి చోరీ

**- ఇంటి దొంగల పనేనంటూ అనుమానం**
**- నిందితులను కఠినంగా శిక్షించాలంటున్న విద్యార్థి నేతలు**




తిరుపతి విద్య జూన్ 11 ప్రభాత వార్త
ఎస్వీయూలో భద్రత డొల్లతనం మరో సారి తేటతెల్లమైంది.ఇప్పటికే వర్సిటీలో వరస చోరీలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదంటూ విద్యార్థులు, ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల వర్సిటీలోని వేంకటేశ్వర స్వామి ఆలయం ఎదుట శ్రీగంథం చెట్టును రాత్రికి రాత్రే మాయం చేశారు. అటవీ అధికారులు సైతం వర్సిటీలో పలు వృక్షాలు మాయమైెట్టు ప్రాథమికంగా గుర్తించారు.గతంలోనూ స్క్రాప్పు వర్సిటీ ఉద్యోగి చోరీ చేసిన దొరికిపోయిన విషయం విదితమే.ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి వర్సిటీలోని హెచ్ బ్లాక్ వసతిగృహంలో దుండగులు చొరబడి లక్షల విలువగల సామాగ్రిని ఎత్తుకెళ్లినట్లు విద్యార్థులు గుర్తించి అధికారులకు సమాచారం అందించారు.వసతి భవనం వెనుకవైపునున్న కిటికీలను తొలగించి స్టీలు టాప్లు, ఖరీదైన సింక్లు, ట్యూబ్ లైట్లు, కుర్చీలు వంటి పలు వస్తువులను దోచుకెళ్లారు. ఈ ఘటన ఇంటి దొంగల పనేనంటూ విద్యార్థులు, ఉద్యోగులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.బయట వ్యక్తులు అయితే వర్సిటీ లోకి చొరబడి దొంగతనం చేసే సాహసం చేయలేరు.ఇది కేవలం యూనివర్సిటీలో పనిచేసే వ్యక్తుల ప్రమేయంతోనే జరిగింది అనుమానం వ్యక్తం చేస్తున్న విద్యార్థి సంఘ నాయకులు.విద్యార్థుల చెల్లించిన ఫీజులతో హాస్టల్స్లో వసతులు ఏర్పాటు చేస్తారని, అధికారులు భద్రత గాలికొదిలేయడంతో ఇలాంటి ఘటనలు పునరావృతం అవుతున్నాయి.వసతి గృహాలలో సీసీ కెమెరాలు ఉన్నా అవి పనిచేసే స్థితిలో లేవు అని, పోలీసలు నిందితులను త్వరలో పట్టుకుని కఠినంగా శిక్షించాలి.అధికారులు వర్సిటీ భద్రతపై స్పందించాల్సిన అవసరం ఉంది అని, సెక్యూరిటీ నిద్రావస్థలో ఉండటమే ఇందుకు ప్రధాన కారణమని విద్యార్థులు సంఘ నాయకులు ఆరోపిస్తున్నారు.

## ప్రపంచంలోనే అత్యున్నత సంస్థగా స్విమ్స్‌ను తీర్చిదిద్దుతాం:టిటిడి ఛైర్మన్

తిరుపతి హెల్త్, జూన్ 11 ప్రభాతవార్త ః
అత్యున్నత సంస్థగా స్విమ్స్‌ను తీర్చిదిద్దుతామని టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు ఉద్ఘాటించారు. స్విమ్స్ 13వ స్నాతకోత్సవాన్ని పురస్కరించుకుని టీటీడీ మహతి ఆడిటోరియంలో బుధ వారం స్నాతకోత్సవ సంబరాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఇడి, సీఈవో ఎయిమ్స్ మధురైకు చెందిన డాక్టర్ హనుమంతరావు, టీటీడీ ఇఒ జె. శ్యామలరావు, టీటీడీ బోర్డు సభ్యులు సుచిత్ర ఎల్లా, ఎన్. సదాశివరావు,ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, స్విమ్స్ అధికారులు, డాక్టర్లు పాల్గొన్నారు. మెయిన్‌లో

# ఖాళీ కుర్చీలతో దర్శనమిస్తున్న సచివాలయాలు

**-ఇష్టానుసారంగా విధులకు హాజరవుతున్న అధికారులు**



దొరవారి సత్రం జూన్ 11 ప్రభాత వార్త:
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటుచేసిన సచివాలయ వ్యవస్థ నీరు కారుతుంది. గ్రామ సచివాలయంలో పనిచేసే అధికారులు తీరుపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తిరుపతి జిల్లా దొరవారిసత్రం మండలం పరిధిలో 11 సచివాలయాలు ఉన్నాయి. అయితే ఈ సచివాలయంలో పనిచేసే అధికారులు, సిబ్బంది సక్రమంగా విధులుకు హాజరు కావడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. బుధవారం మండల పరిధిలోని ఉచ్చూరు,తనియాలి,పోలిరెడ్డిపాళెం తదితర సచివాలయాలు ఖాళీ కుర్చీలతో దర్శనమిస్తున్నాయి. ఇక్కడ పనిచేసే సిబ్బంది అరాకోర తప్ప మిగతా సిబ్బంది విధులకు హాజరు కావడం లేదని స్థానిక గ్రామస్తులు వివరిస్తున్నారు. ఈ విషయంపై ఎంపీడీవో గోవర్ధన్ ప్రభాతవార్త వివరణ కోరిగా అధికారులపై సరైన విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# ఏడాది అయినా శివయ్య సేవా భాగ్యం ఎవ్వరికి దక్కలేదాయే!

**ఆశావహుల్లో నిరుత్సాహం**



శ్రీకాళహస్తి,జూన్ 11 ప్రభాతవార్త
శ్రీకాళహస్తి నియోజకవర్గంలో పార్టీ పదవులు తప్ప నామినేటెడ్ పదవులు ఏడాది అయినా దక్కలేదు. ఇక్కడ శాసనసభ్యుడు ఏ నిర్ణయం తీసుకోవాలన్నా, ఇతర పదవులు ఎవరికి ఇవ్వాలనే అంశం శ్రీకాళహస్తీశ్వరుని పాలకమండలి నియామకం మీద ఆధారపడి ఉంది. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఉన్న కీలక నామినేటెడ్ పదవులు ఒక్క శ్రీకాళహస్తీశ్వరాలయమే. అయితే ఏడాదిగా అదిగో ఇదిగో అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దేవస్థానం పదవులకు సంబంధించి ఊరిస్తున్నారు. మహానాడుకు ముందు అన్ని నామినేటెడ్ పదవుల భర్తీ చేస్తామంటూ ప్రకటించారు.కానీ మహానాడు అయి 15రోజులు దాటుతున్నా దేవాలయాల పదవుల భర్తీకి మోక్షం లభించలేదు. శ్రీకాళహస్తీశ్వరాలయం పదవిని కష్టకాలంలో తనతో పాటు నడచిన మాజీ శ్రీకాళహస్తి వ్యవసాయమార్కెట్ కమిటి అధ్యక్షుడు రంగినేని చెంచయ్య నాయుడుకే అని శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి పలుమార్లు ప్రకటించారు. అయితే సభ్యుల విషయంలో కొంత సందిగ్ధత చోటు చేసుకుంది. పార్టీ అధిష్టానం శ్రీకాళహస్తీశ్వరాలయం రాష్ట్ర స్థాయి దేవాలయాల్లో ఒకటిగా ఉంది కాబట్టి ఈ దేవస్థానంలో ఇతర నియోజక వర్గాలకు సంబంధించిన పార్టీకి సేవలందించిన వారికి అవకాశం కల్పించాలని భావిస్తున్నట్లు సమాచారం. దాంతో శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఎంత మందికి అవకాశం ఉంటుందనేది ప్రశ్నార్థకంగా మారింది.

**దేవస్థానం మండలితో ఇతర పదవుల లింక్:**
శ్రీకాళహస్తీశ్వరాలయానికి సంబంధించి ప్రభుత్వ నిర్ణయం తీసుకుంటే మిగిలిన పదవులకు సంబంధించి ఎంఎల్ఏ నిర్ణయం తీసుకుంటారు. నియోజకవర్గంలోని నాయకుల దృష్టి అంతా శ్రీకాళహస్తీశ్వరుని ధర్మకర్తల మండలి మీదనే ఉంది. దాంతో శాసనసభ్యుని పరిస్థితి అడకత్తెరలో పోక వలే మారింది. ఆయన అయితే జాబితాను పార్టీకి అందించారు. అయితే శ్రీకాళహస్తి తమ్ముళ్ళను సంతృప్తి పరచటానికి ఉన్న ఒకే ఒక అవకాశం శ్రీకాళహస్తీశ్వరాలయం ఈ పదవులన్ని తమ నియోజకవర్గానికే ఇవ్వాలని ఎంఎల్ఏ మొరబెట్టుకున్నారు. ఎంఎల్ఏ జాబితా ఇచ్చినపుడే పార్టీ అధిష్టానం నిర్ణయం తీసుకొని ఉంటే ఇప్పటికి ఏడాది గడిచేది మరో ఏడాదిలో మరి కొందరికి అవకాశం కలిగేది. రాష్ట్రంలోని అన్ని దేవాలయాల పరిస్థితి ఇదే.ఇక దేవస్థానం పాల కమండలి నియామకం జరిగితే శ్రీకాళహస్తి వ్యవ సాయమార్కెట్ కమిటి ఏర్పాటుకు పేర్లు ఇస్తారు. అలాగే చిన్న ఆలయాల పాలకమండళ్ళను నియమి స్తారు.కానీ ఏడాది గడచిని శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి ఊరిస్తూనే ఉంది. కానీ ఈసారి పాలకమండలిలో కొత్తదనం ఉంటుందని పరిశీలకులు భావిస్తున్నారు. ఏదైనా ఎప్పుడుతెలుగుదేశం అధికారంలోకి వచ్చినా శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి నియామకం జాప్యం జరుగుతుందనే నిరాశ చోటు చేసుకుంది. మరి ఇప్పటికైనా అధిష్టానం నిర్ణయంతీసుకుంటుందోనని కార్యకర్తలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

## కాణిపాకం పంచాయతీ కార్యదర్శిగా డిల్లీబాబు



**కాణిపాకం, జూన్ 11 ప్రభాతవార్త:** కాణిపాకం గ్రామ పంచాయతీ కార్యదర్శిగా టిఆర్.డిల్లీబాబును నియమిస్తూ జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాణిపాకం పంచాయతీ గ్రేడ్-1 కార్యదర్శి పోస్టు ఖాళీగా వుండడంతో ప్రస్తుతం వడ్రాంపల్లె పంచాయతీ కార్యదర్శి ప్రమీల ఇన్‌చార్జి కార్యదర్శిగా కొనసాగుతున్నారు. ఈనేపథ్యంలో బుధవారం జిల్లా వ్యాప్తంగా జరిగిన పంచాయతీ కార్యదర్శుల బదిలీల్లో భాగంగా పూతలపట్టు మండలం పి.కొత్తకోట పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న టిఆర్. డిల్లీబాబును కాణిపాకం పంచాయతీ కార్యదర్శిగా నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు రెండు మూడు రోజుల్లో ఆయన బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలుస్తోంది.

## గోవధకు వెళ్తున్న పశువులను కాపాడిన సోమల యువత

సోమల, జూన్ 11, ప్రభాతవార్త



గోవులను కలేబాలకు తరలించేందుకు నాలుగు కంటైనర్లతో వెళుతున్న పశువులను సోమల యువకులు అడ్డుకొని పోలీసులకు అప్పగించారు. వివరాలు ఎలా ఉన్నాయి. సోమల మీదుగా కేరళకు నాలుగు కంటైనర్లలో ఆవులు ఎనుములు వెళుతున్నట్లు స్థానిక యువకులకు సమాచారం అందింది. దీంతో సోమల సమీపంలో యువకులు అడ్డుకొనుగా కంటైనర్లు వేగంగా దూసుకువెళ్లాయి. స్థానిక యువకులు బైకులలో వారిని వెంబడించి ఇరికిపెంట వద్ద లారీలను అడ్డుకున్నారు. ఎస్సై శివశంకర్‌కు సమాచారం అందించగా పోలీసులు డ్రైవర్ క్లీనర్లతో పాటు లారీలను పశువులను స్వాధీనం చేసుకొని స్థానిక మార్కెట్ యార్డులో వాటిని దించి పశుసంవర్ధక శాఖ ఏడి శ్రీనివాసులు కుసమాచారం అందించారు. వైద్యాధికారులు పశువులకు పరీక్షలు నిర్వహించి ఆరోగ్యంగా ఉన్నట్లు నిర్ధారించారు. 150 పశువులను కాపాడిన స్థానిక యువకులను మండల ప్రజలు అభినందిస్తున్నారు.

## అన్నదాత సుఖీభవకు రైతులు ఇకెవైసి చేసుకోవాలి

**శాంతిపురం, జూన్ 11 ప్రభాతవార్త** శాంతిపురం మండల పరిధిలో ఉన్న 8776మంది రైతులు అన్నదాత సుఖీభవ పథకంకు అర్హులుగా ఉన్నారని వీరు గురువారం నుంచి రైతు సేవా కేంద్రాల్లో ఇకెవైసి చేయించుకోవాలని వ్యవసాయాధికారి అప్పోజి తెలిపారు. రైతుల వివరాలు రైతు సేవా కేంద్రాల్లో ఉన్నాయన్నారు. ఈనెల 13వతేది లోగా రైతులు తప్పక ఇకెవైసి చేయించుకోవాలని కోరారు.

## పరమహంస యోగానందలో యోగాంధ్ర ఉత్సవాలు



***శాంతిపురం, జూన్ 11 ప్రభాతవార్త*** స్థానిక శ్రీ పరమహంస యోగానంద పాఠశాలలో అంతర్జాతీయ యోగా మాసోత్సవాల్లో భాగంగా బుధవారం యోగాంధ్ర ఉత్సవాలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఆజాద్ హుసేన్ మాట్లాడుతూ విద్యార్థులు యోగాను దైనందిన జీవితంలో భాగం చేసుకుంటే చక్కటి ఆరోగ్యంతో ఉండవచ్చున్నారు. ఈసందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ పార్థీవులు విద్యార్థులచే యోగాసనాలు వేయించారు.ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారి పక్కన డివైడర్ ప్రమాదకరం



***గుడుపల్లె, జూన్ 11 ప్రభాతవార్త*** మండలోని జాతీయ రహదారిలో పిఇఎస్ ఆస్పత్రి వద్ద కళాశాల వారు జాతీయ రహదారికి అడుకుని డివైడర్లు ఏర్పాటుచేసే ప్రయత్నాలు మానుకోవాలని కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ ఆవుల గోపి పేర్కొన్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో డివైడర్లు ఏర్పాటుచేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. వెంటనే ఈ డివైడర్లను తొలగించాలని అక్కడ పూర్వస్థితి కొనసాగించాలని పేర్కొన్నారు. డివైడర్లు తొలగించని పక్షంలో ఈ విషయంగా ఆందోళన కార్యక్రమాలు చేపడ్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్, మండల పార్టీ అధ్యక్షులు నిజామ్, మునస్వామి, నంజప్ప, కృష్ణప్ప, మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఇర్ఫాన్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు నాగరాజు పాల్గొన్నారు.

## నేడు ఎయిర్‌పోర్ట్ భూములపై ప్రజాభిప్రాయ సేకరణ

***శాంతిపురం, జూన్ 11 ప్రభాతవార్త*** మండలంలోని సొన్నేగానిపల్లి, అమ్మవారిపేట, దండికుప్పం గ్రామాల పరిధిలో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్‌కు భూసేకరణ నిమిత్తం గురువారం ఉదయం 10గంటలకు స్థానిక మండల కార్యాలయ ఆవరణలో ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం ను జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ నిర్వహిస్తున్నారని తహశీల్దార్ శివయ్య తెలిపారు. ప్రజలు ఈ కార్యక్రమంకు హాజరై తమ అభిప్రాయాలను అధికారుల దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు.

## డిప్యూటీ డిఎంహెచ్ఒచే ఆస్పత్రి సీజ్

***కుప్పం, జూన్ 11 ప్రభాతవార్త*** కుప్పం పట్టణం ప్యాలస్ రోడ్‌లో ఉన్న ఎఆర్ హాస్పిటల్, నర్సి ంగ్‌హోంను బుధవారం డిప్యూటీ డిఎంహెచ్ఒ గంగాదేవి సీజ్ చేశారు. మంగళవారం కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ ఈ ఆస్పత్రిలో తనిఖీలు నిర్వహించగా ఆస్పత్రిని నిర్వహిస్తూ వైద్యుడిగా చెలామణి అవుతున్న అరుణ్ అన్నాత్ నకిలీ వైద్యుడని అతని వద్ద ఎలాంటి సర్టిఫికెట్లు లేవని నిర్ధారించారు. కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆదేశాల మేరకు డిప్యూటీ డిఎంహెచ్ఒ గంగాదేవి, కుప్పం అర్బన్ ఎస్సై బాబు, సిబ్బంది ఆస్పత్రి వద్దకు చేరుకుని సీజ్ చేశారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

## ప్రభుత్వం జర్నలిస్టుల సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

***నదుం, జూన్ 11, ప్రభాతవార్త*** జర్నలిస్టుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని చిత్తూరు జిల్లా ఏపీడబ్ల్యూజేఎఫ్ సంయుక్త కార్యదర్శులు కటారి రామయ్య, మల్లేపల్లి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. బుధవారం జర్నలిస్టులు అందరూ కలిసి డిమాండ్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు తమ సమస్యలు పరిష్కరించాలని తాసిల్దార్ కార్యాలయం వద్ద డిప్యూటీ తాసిల్దార్ కుమార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం మాట్లాడుతూ జర్నలిస్ట్ లకు సంబందించిన సమస్యలను ఏపీ డబ్ల్యూ జె ఎఫ్ యూనియన్ ఆధ్వర్యంలో ప్రభుత్వం దృష్టికి తీసుకు పోయేందుకు నేడు జర్నలిస్టులు అందరు కలసి డిమేండ్స్ డే పాటిస్తూ అన్ని మండలాలలో తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రాలు అందజేయడం జరిగిందనిఅన్నారు.జర్నలిస్టులుగిరీష్ కర్నాడ్, జీవి శేష గిరి, ఉల్లి భాస్కర్, మల్లెల గిరిబాబు పాల్గొన్నారు.



### బంగారుపాళ్యం దళితవాడలో గంగజాతర

బంగారుపాళ్యం, జూన్ 11 ప్రభాతవార్త: మండల కేంద్రం బంగారుపాళ్యం దళితవాడలో రెండు రోజుల పాటు గంగజాతర ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మంగళవారం దళితవాడ ప్రజలు గ్రామ దేవతకు పొంగళ్ళు పెట్టి నైవేద్యం పూజలు నిర్వహించారు. మంగళవారం రాత్రి గంగమ్మ శిరస్సు పురవీధుల్లో ఊరేగించి బుధవారం తెల్లవారుజామున దళితవాడ నడివీధిలో ప్రతిష్టించారు. జంతు బలులతో అమ్మవారి తొలి దర్శనం జరిగింది. పలువురు మహిళలు అమ్మవారిని దర్శించుకుని తమ మొక్కులను తీర్చుకున్నారు. గంగమ్మను మాజీ జడ్పీ ఛైర్మన్ కుమార్‌రాజా, ఎంపిటిసీ పద్మావతి, సర్పంచ్ ఎంబి ఉమాదేవి, ఉప సర్పంచ్ కామరాజు, మాజీ సర్పంచ్ కృష్ణమూర్తి తదితరులు దర్శించుకున్నారు. బుధవారం రాత్రి భారీ ఎత్తున బాణసంచా పేల్చుతూ గంగమ్మను జలప్రవేశం గావించారు.

## గరుడ వాహన సేవలో ఎమ్మెల్యే భానుప్రకాశ్

వడమాలపేట, జూన్ 11 ప్రభాతవార్త :



అప్పలాయగుంటలో జరుగుతున్న ప్రసన్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో బుధవారం నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ పాల్గొన్నారు. సాయంత్రం అప్పలాయగుంటకు వచ్చిన ఎమ్మెల్యేకు టిటిడి అధికారులు స్వాగతం పలికారు. వేదపండితులు స్వామివారి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందించారు. అనంతరం ఆయన గరుడ వాహన సేవలో పాల్గొన్నారు. కార్యక్రమంలో పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గంజి మాధవయ్య, జడ్పిటిసి సభ్యులు మురళీరెడ్డి, టిడిపి నాయకుడు ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

## సర్వసభ్య సమావేశంలో అధికారులను నిలదీసిన ప్రజా ప్రతినిధులు

-గ్రామీణులకు అందని వైద్యంపై రచ్చరచ్చ -తగినన్ని విత్తన శెనక్కాయలందించాలని మనవి



***చౌడేపల్లి, జూన్ 11 ప్రభాతవార్త*** మండల సర్వసభ్య సమావేశంలో ప్రజా ప్రతినిధులు అధికారులను నిలదీశారు. వర్షాలు ఆశాజనికంగా వున్నాయనీ, అయితే అరకొరగా విత్తన శెనక్కాయలిచ్చి చేతులు దులుపుకొంటున్నారని ఉపాధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి వ్యవసాయాధికారిణి జ్యోతమ్మను ప్రశ్నించారు. అదే విధంగా ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో వైద్యులు అందుబాటులో లేరనీ, ఇటీవల ప్రాణాపాయ స్థితిలో రోగి వస్తే స్పందన కరువైందని సెల్‌ఫోన్‌లో తీసిని విడియోను చూపుతూ ఆరోగ్య సూపర్ వైజర్ బాహుద్దీన్‌ను నిలదీశాడు. ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో ఉచితంగా స్వచ్ఛజలాన్నందిస్తుంటే బిందెకు నగదును వసూలు చేస్తున్నారని ఆరోపించారు. పందిళ్ళపల్లి పంచాయతీలో చెత్తను సేకరించే బక్కెట్లను సంవత్సరం కాలమవుతున్నా పంపిణీ చేయలేదన్నారు. విద్యుత్‌ఛార్జీలు తడసి మోపెడవుతున్నాయని గ్రామీణ ప్రాంత ప్రజలు బిల్లులు పట్టుకొంటేనే షాక్‌కొడుతోందని ఉపాధ్యక్షుడు నరసింహులు యాదవ్ అన్నారు. మండల పరిషత్ అభివృద్ధిలో తమను భాగస్వాములుగా చేయాలని పలువురు ఎంపిటీసీ సభ్యులు కోరారు. ప్రజా ప్రతినిధులు అడిగిన సమస్యలను పరిశీలించి పరిష్కరిస్తామని ఆయా శాఖాధికారులు వారికి సమాధానమిచ్చారు. మండలంలో 19మంది సర్పంచులుండగా కేవలం 14మంది సమావేశానికి గైర్హజరయ్యారు. అదే విధంగా పలువురు ఎంపిటీసీ సభ్యులు, అధికారులు సమావేశానికి హాజరు కాలేదు. దీంతో సమావేశపు గదిలో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. ఎంపిపి గాజుల రామ్మూర్తి, ఎంపిడిఓ లీలామాధవి, తహశీల్దార్ హనుమంతు, సర్పంచుల సంఘ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సమకాలిన రాజకీయాలకు ఆదర్శం " గువ్వల రమేష్‌రెడ్డి "



***చౌడేపల్లి, జూన్ 11 ప్రభాతవార్త*** సమకాలిన రాజకీయాలకు ఆదర్శం మండల తేదేపా అధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి(చిట్టి)అని పలువురు కొనియాడారు. ఆయన జన్మదినం సందర్భంగా అభిమానులు, తేదేపా నాయకులు స్థానిక బస్టాండులో వేడుకలను ఘనంగా నిర్వహించారు. భారీ కేక్‌ను కట్‌చేసి అన్నదాన శిబిరాన్ని ఏర్పాటు చేసారు. ఆరోగ్య కేంద్రంలో పాలు, పండ్లు పంచిపెట్టారు. ఆవరణంలో పలువురు నాయకులు రక్తదానం చేసారు. రాజకీయ కుటుంబ నేపథ్యంలోంచి వచ్చిన గువ్వల రమేష్‌రెడ్డి ఆయన తండ్రి దివంగత గువ్వల రామకృష్ణారెడ్డి వారసత్వాన్ని పునికి పుచ్చుకొన్నారన్నారు. సమాజం బాగుండాలి అందులో తానుండాలనుకొనే వ్యక్తిగా అందరికి సుపరిచితుడన్నారు. నాయకులు పూల చంద్రమౌళి, శ్రీధర్‌రాజు(గిరి), సుధాకర్‌రెడ్డి, అనూష్, పార్థసారధినాయుడు, అర్జున్‌రాయల్, బోయకొండ సుబ్బు, సోము, పంజానిపల్లి బాబు, వెంకట్రమణ, వేలూరి సుబ్రమణ్యం, గిరినాయుడు, ధర్మ, పెద్ద ఎత్తున్న నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇంటర్ విద్యార్థి అదృశ్యం



చౌడేపల్లి, జూన్ 11 ప్రభాతవార్త

ఇంటర్ ఫస్టీయర్ చదువుతున్న విద్యార్థి అదృశ్యమైన సంఘటన చౌడేపల్లిలో చోటు చేసుకొంది. ఎస్ఐ నాగేశ్వరరావు కథనం మేరకు...చౌడేపల్లి బజారువీధికి చెందిన అమరనాథ్ కుమారుడు ఎ.విశ్వతేజ(17)తిరుపతిలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్‌ఫస్టీయర్ చదువుతున్నాడు. ప్రస్తుతం సెలవులు కావడంతో ఇంట్లోనే వుంటున్నాడు. ఈక్రమంలో ఈనెల 7న ఇంటి నుంచి బయటకు వెళ్ళాడు. ఎంతకూ ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు, స్నేహితులు, కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతికినా ఫలితం లేదు. ఈ మేరకు విశ్వతేజ తండ్రి అమరనాథ్ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 9440900698కి సమాచామందించాలని ఆయన కోరారు.

## ద్విచక్ర వాహనంలో ప్రత్యక్షమైన నాగుపాము

-పరుగులు తీసిన జనం



***చౌడేపల్లి, జూన్ 11 ప్రభాతవార్త*** ద్విచక్రవాహనంలో నాగుపాము ప్రత్యక్షం కవాడంతో అక్కడున్న జనం పరుగులు తీశారు. మండలంలోని పందిళ్ళపల్లి పంచాయతీ బాలసముద్రంకు చెందిన మునిరాజ సొంత పని నిమిత్తం దొరబావివద్దగల పోలీస్‌స్టేషన్‌కు ద్విచక్రవాహనంపై వచ్చాడు. తిరుగు ప్రయాణం అయ్యేందుకు స్కూటర్ దగ్గరుకు సీటు కిందనుంచి బసలు కొడుతూ నాగుపాము ప్రత్యక్షమైంది. దీంతో అక్కడన్న జనం పరుగులు తీశారు. అనంతరం సర్పాన్ని టూవీలర్ నుంచి తరిమేయడంతో అందరూ ఊపిరి పీల్చుకొన్నారు.

## నిబంధనలు పాటించని వాహనాలు సీజ్



చౌడేపల్లి, జూన్ 11 ప్రభాతవార్త

ప్రభుత్వం నిబంధనలు పాటించకుండా వెళుతున్న వాహనాలను సీజ్ చేసినట్లు ఎస్ఐ నాగేశ్వరరావు తెలిపారు. ఆయన కథనం మేరకు... తిరుపతి-పుంగనూరు ప్రధాన రహదారిలో రెండు క్వారీ రాళ్ళను తరలిస్తున్న లారీలు, ఒక ఇసుక ట్రిప్పర్‌ను తిరుపతి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్ అధికారులు నిబంధనలు పాటించలేదని పట్టుకొని సీజ్ చేసారు. వాటిని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు ఎస్ఐ వివరించారు.

## అర్ధగిరిలో ఘనంగా పౌర్ణమి వేడుకలు



**తవణంపల్లె, జూన్ 11 ప్రభాతవార్త:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన అరగొండ అర్ధగిరి శ్రీవీరాంజనేయస్వామి దేవస్థానంలో బుధవారం పౌర్ణమి వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయి. ప్రతి నెలా ఆలయంలో పౌర్ణమి వేడుకలు నిర్వహిస్తుంటారు. ఈ మేరకు ఆలయ ఈఓ టి.హనుమంతురావు ఆధ్వర్యంలో ఈ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో ప్రధాన అర్చకులు వేణుగోపాలాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం స్వామివారి మూలవిరాట్‌కు శాస్త్రోక్తంగా పంచామృతాభిషేకం, పూజలు నిర్వహించి ధూప దీప నైవేద్యాలను సమర్పించి భక్తులకు దర్శనం కల్పించారు. అలాగే అర్చకులు ఉదయం 11 గంటలకు ఆలయ మండపంలో సుదర్శనహోమం, ఆకుపూజ, వడమాలసేవ, మధ్యాహ్నం సహస్రనామార్చన, ఆకుపూజ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అలాగే రాత్రి స్వామివారికి ప్రాకారోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఈమేరకు అలంకరించిన స్వామివారిని ప్రత్యేక పల్లకిపై వుంచి ఆలయం, సంజీవరాయని పుష్కరిని చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. ఈసందర్భంగా భక్తుల కాలక్షేపం నిమిత్తం పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. అలాగే భక్తులకు అన్నదానం నిర్వహించడంతో పాటు తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఆలయ అధికారులు, అర్చకులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

## గణనాధునికి వెండి పూజా సామాగ్రి విరాళం



**కాణిపాకం, జూన్ 11 ప్రభాతవార్త:** కాణిపాకం శ్రీవరసిద్ది వినాయక స్వామివారి దేవస్థానంకు ఓ భక్తుడు బుధవారం 1.75 లక్షలు రూపాయలు విలువగల వెండి పూజా సామాగ్రిని విరాళంగా అందజేశారు. ఈమేరకు చిత్తూరుకు చెందిన శివ భరద్వాజ్ అనే భక్తుడు సుమారు ఒక కిలో 700 గ్రామాల వెండితో 1.75 లక్షల రూపాయల వ్యయంతో ప్రత్యేకంగా తయారు చేయించిన బిందె, అర్చన పళ్ళెలంను ఆలయానికి విరాళంగా అందజేశారు. వాటిని ఆలయ ఈఓ పెంచల కిషోర్‌కు అందజేశారు. దాతలకు ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు.ఈకార్యక్రమంలో ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, సూపరెండెంట్ కోదండపాణి, దాతల కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించండి

ఏపీడబ్ల్యూజే డిమాండ్

**పుంగనూరు రూరల్, జూన్ 11, ప్రభాతవార్త** జర్నలిస్టుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని చిత్తూరు జిల్లా ఏపీడబ్ల్యూజేఎఫ్ ప్రధాన కార్యదర్శి సలీం,పుంగనూరు నియోజకవర్గ అధ్యక్షుడు సతీష్ లు డిమాండ్ చేశారు. వారు మాట్లాడుతూ జర్నలిస్ట్ లకు సంబంధించిన సమస్యలను ఏపీ డబ్ల్యూ జె ఎఫ్ యూనియన్ ఆధ్వర్యంలో ప్రభుత్వం దృష్టికి తీసుకు పోయేందుకు నేడు జర్నలిస్ట్ లు అందరు కలసి డిమాండ్స్ డే పాటిస్తూ అన్ని మండలాలలో తహసీల్దార్ కార్యాలయం లో వినతి పత్రాలు అందజేయడం జరిగిందని అన్నారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలను కేటాయించాలని,మీడియా కమిషన్, జర్నలిస్టుల పెన్షన్, మీడియా అకాడమీ బలోపేతం చేయాలనీ, జర్నలిస్టుల ఉద్యోగా భద్రత, జర్నలిస్టుల ఆరోగ్య బీమా, జర్నలిస్ట్ పిల్లలకు ప్రవేటు స్కూల్లలో రాయితీని కల్పించాలని, జర్నలిస్టులందరికీ సకాలంలో అక్రిడేషన్లు మంజూరు చేయాలని కోరూతు పుంగనూరు తహశీల్దార్ కార్యాలయంలో బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పుంగనూరు ఎపిడబ్ల్యూజేఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గిరి శేఖర్, ఉపాధ్యక్షులు మహమ్మద్ సైపుల్ల, జగదీష్, లోకేష్, జావీద్ గౌరవ అధ్యక్షులు జి.ఆర్. మురళి, ప్రధాన కార్యదర్శి హిదాయ తుల్లా(అప్పు), కోశాధికారి భాను ప్రకాష్, వర్కింగ్ ప్రెసిడెంట్ మురళి, లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు కృష్ణమూర్తి, రెడ్డెప్ప, బాబు, మంజునాథ్, సతీష్,శామీర్, పురుషోత్తం, కార్తీక్, విజయ్, బాలకృష్ణ, ఇర్ఫాన్, జర్నలిస్టులు పాల్గొన్నారు.

## అన్నదాత సుఖీభవ వచ్చే రైతులు ఈ కేవైసీ తప్పనిసరి

పూతలపట్టు, జూన్ 11, ప్రభాతవార్త



రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న అన్నదాత సుఖీభవ నగదు తీసుకొని ప్రతి రైతు ఈ ఏడాది (2025) రైతు భరోసా నగదు రైతులు ఖాతాల్లో రావాలంటే రైతులు 13వ తేదీ లోపు సచివాలయాల్లోని వ్యవసాయ శాఖ అధికారుల దగ్గర ఆధార్ కార్డు తీసుకుని వెళ్లి ఈ కేవైసీ( వేలిముద్ర )వేసుకోవాలని వ్యవసాయ అధికారి మధురవాణి తెలిపారు. బుధవారం తేనే పల్లె రైతు భరోసా కేంద్రంలో ఈ కేవైసీ గురించి రైతులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ కేవైసీ చెయ్యని రైతులకు ప్రభుత్వం అందించే రైతు భరోసా నగదు రాదని తెలిపారు. రైతు సోదరులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ నీలిమ, ప్రభావతి, రైతుల పాల్గొన్నారు.

## 67 లక్షల మందికి తల్లికి వందనం నిధులు

– రాష్ట్ర తెలుగుదేశం అధికార ప్రతినిధి వెంకిటీల సురేంద్రకుమార్

**చిత్తూరు, జూన్ 11 ప్రభాతవార్త:** కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీ అయిన సూపర్ సిక్స్ పథకాల్లో ఒకటైన తల్లికి వందనం అమలుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు రాష్ట్ర తెలుగుదేశం అధికార ప్రతినిధి వెంకిటీల సురేంద్రకుమార్ పేర్కొన్నారు. జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో 67 లక్షల మంది విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాల్లో గురువారం తల్లికి వందనం నిధులను ప్రభుత్వం జమ చేయనున్నదని ఆయన తెలిపారు. . తల్లికి వందనం పథకం కింద గురువారం తల్లుల ఖాతాల్లో రూ.8,745 కోట్లు ప్రభుత్వం జమ చేస్తున్నదన్నారు. ఈ పథకం కింద ప్రస్తుతం 1వ తరగతిలో అడ్మిషన్లు పొందే విద్యార్థుల నుండి టెన్త్ పాసై ఫస్టియర్‌లో చేరే విద్యార్థులకు ఈ పథకం వర్తిస్తుందన్నారు. విద్యార్థుల అడ్మిషన్లు పూర్తయి డేటా అందుబాటులోకి వచ్చిన వెంటనే ఆ విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నిధులు జమ అవుతాయన్నారు.

## గంగమ్మకు సికె సాయికృష్ణారెడ్డి ప్రత్యేక పూజలు



**చిత్తూరు, జూన్ 11 ప్రభాతవార్త:** చిత్తూరు నియోజకవర్గ పరిధిలో పెద్దిశెట్టిపల్లి గ్రామంలో బుధవారం జరిగిన గంగ జాతరలో మాజీ ఎమ్మెల్యే సికె బాబు తనయుడు సికె సాయి కృష్ణారెడ్డి పాల్గొని గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సికె సాయి కృష్ణారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా వుండాలని, సిఎం నారా చంద్రబాబునాయుడు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్‌లు రాష్ట్రంలో సుపరిపాలన అందించే శక్తిని ప్రసాదించాలని గంగమ్మ తల్లిని వేడుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సికె సాయికృష్ణారెడ్డికి పెద్దిశెట్టిపల్లి గ్రామ ప్రజలు ఘనంగా సన్మానించారు.

## బోరు వేశారు... మోటారు, విద్యుత్ కనెక్షన్ మరిచారు

పట్టించుకోని అధికారులు, స్థానిక నేతలు

నీటికోసం అల్లాడుతున్న గ్రామస్తులు



**పాలసముద్రం, జూన్ 11 ప్రభాతవార్త:** పాలసముద్రం మండలం వెంగళరాజుకుప్పం జయరామపురం గ్రామ ప్రజలు గుక్కెడు మంచినీటి కోసం అల్లాడుతున్నారు. ఈ గ్రామంలో మంచినీటి సమస్యను పరిష్కరించడానికి పాలకులు ఎనిమిదేళ్ళ క్రితం ఒక బోరు డ్రిల్ చేయడంతో తమ గ్రామానికి పట్టిన మంచినీటి గ్రహణం తప్పుతుందని అప్పట్లో గ్రామస్తులు భావించారు. అయితే అప్పటి పాలకులు బోరు వేసి దానికి మోటరు, విద్యుత్ కనెక్షన్ ఇవ్వకపోవడంతో అప్పటి నుండి గ్రామస్తులు వ్యవసాయ బావుల నుండి తాగడానికి మంచినీటిని తీసుకువచ్చి తమ దప్పికను తీర్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. జయరామపురం గ్రామంలో సుమారు 15 కుటుంబాలు నివాసం వుంటున్నాయి. ఈ కుటుంబాలు మంచినీటి కోసం అల్లాడుతుండటం చూసిన అప్పటి పాలకులు చొరవతో 2017-18 సంవత్సరంలో జయరామపురం గ్రామంకు ఒక మంచినీటి బోరును వేశారు. అయితే బోరుకు మోటర్‌తో పాటు విద్యుత్ కనెక్షన్ ఇవ్వకపోవడంతో ప్రస్తుతం సుమారు 8 సంవత్సరాలుగా ఆ బోరు నిరుపయోగంగా వుంది. దీంతో బావుల వద్దకు వెళ్ళి ప్రజలు మంచినీరు తెచ్చుకునే పరిస్థితి నెలకొంది. ఈ విషయంపై ఇప్పటికే పలుమార్లు అధికారులకు వినతిపత్రాలు అందించినా ఇప్పటి వరకు స్పందించకపోవడంతో గ్రామ ప్రజలు మంచినీటి కోసం అల్లాడుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి బోరుకు మోటరు, విద్యుత్ కనెక్షన్ మంజూరు చేసి ఆ గ్రామస్తులు మంచినీటి కష్టాలను తొలగించాల్సిన అవసరం ఎంతైనా వుంది.

## విధ్వంసం వైపు నుండి అభివృద్ధి వైపుకు

- ప్రతిహామీ అమలు చేస్తున్న సిఎం చంద్రబాబు - ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు



***చిత్తూరు, జూన్ 11 ప్రభాతవార్త:*** రాష్ట్రంను విధ్వంసం వైపు నుండి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అభివృద్ధి వైపు తీసుకెళ్తున్నారని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు పేర్కొన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు విలేకరులతో మాట్లాడారు. విజన్ కల్గిన నాయకులు సిఎం నారా చంద్రబాబునాయుడు సారధ్యంలో రాష్ట్రం దేశంలోనే నెంబర్‌వన్ రాష్ట్రంగా అభివృద్ధి వైపు పరుగులు తీస్తుందన్నారు. రాష్ట్ర ప్రజలు పెట్టుకున్న నమ్మకంను నిజం చేస్తూ కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం నిత్యం పని చేస్తోందన్నారు. సిఎం నారా చంద్రబాబునాయుడు అధికారం చేపట్టిన మొదటి రోజే పెన్షన్ల మొత్తంను పెంచి ఇవ్వడంతో పాటు అన్నా క్యాంటీన్లను ఏర్పాటు చేయడం, మెగా డిఎస్సీ ప్రకటన, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, చెత్తపై పన్ను రద్దు చేయడం జరిగిందన్నారు. అలాగే ఉచిత ఇసుక విధానం, దీపం 2.0 పథకంను విజయవంతంగా అమలు చేస్తున్నామన్నారు. ప్రస్తుతం ఒకటి రెండు రోజుల్లో తల్లికి వందనం అమలు చేయడంతో పాటు అన్నదాత సుఖీభవ నిధులు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం జరుగుతుందన్నారు. చిత్తూరు నియోజకవర్గంలో మొదటి ఏడాది రూ.55 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. రానున్న నాలుగేళ్ళలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు మరింత ముందుకు తీసుకెళ్ళి ప్రజలకు మరింత మంచి పాలన అందిస్తామన్నారు.

## ఆకట్టుకున్న అర్జున తపస్సు



**శ్రీరంగరాజపురం, జూన్ 11 ప్రభాతవార్త:** శ్రీరంగరాజపురం ద్రౌపతి సమేత ధర్మరాజుల స్వామి మహాభారత ఉత్సవాల్లో భాగంగా బుధవారం అర్జున తపస్సు వైభవంగా ముగిసింది. మహాభారత ఉత్సవాలు నిర్వహించే ధర్మరాజుల గుడి ఆవరణలో నిర్వహించిన ఈ తపస్సు ఘట్టం అందరిని ఆకట్టుకొంది. నరసింహులు అర్జున వేషాధారిగా శివుని స్తుతిస్తూ పాశుపశార్థం కోసం తపస్సుఅధిరోహిస్తూ పాడిన పద్యాలకు ప్రజలు ముగ్దులయ్యారు. ఈ కార్యక్రమానికి ఉభయదారులుగా పుల్లూరు క్లాసిక్ పి.అంజనేయులు, కృష్ణమ్మ దంపతులు వ్యవహరించారు. శ్రీరంగరాజపురం గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాల నుండి పెద్ద ఎత్తున ఈ కార్యక్రమానికి భక్తులు హాజరయ్యారు. అర్జునుడు విసిరిన విభూది, నిమ్మకాయల కోసం భక్తులు ఎగబడ్డారు. పలువురు మహిళలు సంతానం కలగాలంటే తపస్సు మాను వద్ద పొర్లు దండాలు పెట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త వేణునాయుడు, నిర్వాహకులు ఎత్తురాజులు నాయుడు, నారాయణస్వామినాయుడు, కేశవనాయుడు తదితరులు పాల్గొన్నారు

## శ్రీవారికి వైభవంగా గరుడోత్సవం

పుంగనూరు రూరల్, జూన్ 11, ప్రభాతవార్త



జేష్ఠ మాసం పౌర్ణమి సందర్భంగా బుధవారం సాయంత్రం కళ్యాణ వేంకట రమణ స్వామి గరుడోత్సవం అత్యంత వేడుకగా జరిగింది. పట్టణంలోని స్థానిక వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద నుంచి శ్రీవారి ఉత్సవమూర్తిని పురవీధుల్లో మంగళ వాయిద్యాలతో ఊరేగించారు. భక్తులు స్వామివారిని దర్శించగా, మహిళలు మంగళ హారతులు పట్టారు. కార్యక్రమాలను టీటీడీ అధికారులు పర్యవేక్షించారు.

## చిరుత దాడిలో పశువు మృతి



**చౌడేపల్లి, జూన్ 11 ప్రభాతవార్త** చిరుత దాడిలో పశువు మృతి చెందిన సంఘటన చౌడేపల్లిలో చోటు చేసుకొంది. బాధిత రైతు కథనం మేరకు...చౌడేపల్లి పరిధిలోని గోసలకురపల్లికి చెందిన వంకర కుమార్ గ్రామానికి సమీపంలోని అంకాలమ్మకొండ వద్ద పశువులను పోషించుకొంటూ పొలం వద్దనే వుంటున్నారు. ఈక్రమంలో మంగళవారం రాత్రి వర్షం కారణంగా పశువులను కొట్టంలో భద్ర పరచి ఇంటికి వెళ్ళారు. బుధవారం ఉదయాన్నే వచ్చి చూడగా పశువుల కొట్టానికి కూతవేటు దూరంలో చిరుత దాడిలో మృతి చెందిన పశువును కనుగొన్నారు. ఫారెస్టు సెక్షన్ అధికారిణి ఇంద్రాణి, బీట్ ఆఫీసర్ ప్రభాకర్‌లు చిరుత దాడిలో పశువు మృతి చెందినట్లుగా గుర్తించారు. పశువైద్యాధికారి పవన్ పోస్టుమార్టం నిర్వహించారు. పాడిపరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్న తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు.

## చెంచుగుడి మహాభారతంలో వైభవంగా అర్జున తపస్సు

**వెదురుకుప్పం, జూన్ 11 ప్రభాతవార్త :** మండలంలోని చెంచుగుడి మహాభారత వార్షికోత్సవ ఉత్సవాల్లో భాగంగా బుధవారం వైభవంగా అర్జున తపస్సు కార్యక్రమం నిర్వహించారు. ఉదయం ఆలయం శుద్ది చేసి మూలవిరాట్, ఉత్సవమూర్తులను వివిధ అభిషేకాలు. పూజలు నిర్వహించి పట్టు వస్త్రలు, పూలతో ప్రత్యేకంగా అలంకరించి అర్జున వేషాదారి మొట్టుకు పాటలు పాడుతూ తపస్సు అధిరోహించి, తన వెంట తీసుకువెళ్ళిన వీబుధిపండ్లు, నిమ్మపండ్లు భక్తుల పైకి విసరడంతో వాటికి భక్తులు పోటీపడ్డారు. అర్జున తపస్సు చుట్టు వరపడటం వలన కోరిన కోర్కెలు నేరవేరుతాయని ప్రతీతి ఉండటంతో సంతానం కొరకు, కార్యక్రమంకు ఉభయదాతలుగా పూల వెంకటరామి రెడ్డి కుమారుడు పూల యశ్వంత్ రెడ్డి వ్యవహారించారుఆలయ ధర్మకర్తలు బోడి రెడ్డి మోహన్ రెడ్డి, తారక్ రెడ్డి, ముఖ్య కార్య నిర్వహకులు కృష్ణా రెడ్డి, గోపాల్ రెడ్డి, పెద్ద సంఖ్యలో మహిళ భక్తులు పాల్గొన్నారు.

## ట్రాక్టరు-ఈచర్ ఢీ

**బంగారుపాళ్యం, జూన్ 11 ప్రభాతవార్త:** చెన్నై-బెంగళూరు జాతీయ రహదారి నలగాంపల్లి ఫ్లైఓవర్ వద్ద బుధవారం ఉదయం ట్రాక్టర్, ఈచర్ వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందగా మరొక వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. యాదమరి మండలం సిఆర్ కండ్రిగ గ్రామంకు చెందిన మణిరెడ్డి(60) తన మామిడి తోటలోని మామిడి కాయలను ట్రాక్టర్‌లో లోడ్ చేసుకుని బంగారుపాళ్యం మార్కెట్ యార్డుకు తరలించాడు. మామిడి కాయలను యార్డు నందు దించివేసి తిరిగి తన స్వగ్రామంకు ట్రాక్టర్ నడుపుకుంటూ వెళ్తుండగా వెనుకవైపు నుండి ఈచరు వాహనం అతివేగంగా ఢీకొంది. ఆ సమయంలో ట్రాక్టర్ నడుపుతున్న మణిరెడ్డి రోడ్డుపై పడటంతో ఈచరు వాహనం అతని తలపై తొక్కుకుంటూ వెళ్ళింది. ఈ ప్రమాదంలో మణిరెడ్డి తల నుజ్జునుజ్జు కావడంతో సంఘటనా స్థలంలోనే అతను మృతి చెందాడు. ట్రాక్టర్‌లో ప్రయాణిస్తున్న మరో వ్యక్తి వెంకటేష్‌రెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ మేరకు సర్కిల్ ఇన్స్‌పెక్టర్ కత్తి శ్రీనివాసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఎంపిడిఓను దుర్భాషలాడిన మాజీ ఫీల్డ్ అసిస్టెంట్‌పై కేసు

***శ్రీరంగరాజపురం, జూన్ 11 ప్రభాతవార్త:*** ఎంపిడిఓ మోహన్‌మురళీని కమ్మకండ్రిగ గ్రామ మాజీ ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేష్, అతని భార్య సుబ్బలక్ష్మీ, జ్యోతినాధంలు దుర్భాషలాడటంతో పోలీసులు ముగ్గురిపై బుధవారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ సుమన్ వెల్లడించిన వివరాల మేరకు ఉపాధి పథకంలో భారీ అక్రమాలకు పాల్పడటంతో ఫీల్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న వెంకటేష్ భారీ అవినీతి, ఈ విషయంపై సోమవారం మాజీ ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేష్, అతని భార్య సుబ్బలక్ష్మీ, అతని సోదరుడు జ్యోతినాధంలో సోమవారం ఎంపిడిఓ కార్యాలయంకు వెళ్ళి తనకు ఉద్యోగం పోవడానికి ఎంపిడిఓ ఛాంబర్‌లోకి వెళ్ళి ఎంపిడిఓ మోహన్ మురళీ కారణమని దుర్భాషలాడటం జరిగిందన్నారు. అలాగే తనకు ఉద్యోగం పోవడానికి కారణమైన ఎంపిడిఓపై ఆగ్రహం వ్యక్తం చేసిన వెంకటేష్ తనకు అన్యాయం చేశారని,ఆత్మహత్య చేసుకుంటానని సమీపంలోని సెల్ టవర్ ఎక్కి హాల్ చల్ చేశాడన్నారు. ఎంపిడిఓ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

# ఐదేళ్ళలో రోడ్ల మీద తట్టెడు మట్టి పోయలేదు

కెకెజి రోడ్డు ప్రారంభంలో ఎంఎల్ఏ
ఏడాదిలో రూ.50కోట్లతో రోడ్ల నిర్మాణం
: ఏడాదిలో రోడ్ల రూపం మారింది.

తొట్టంబేడు,జూన్ 11 ప్రభాతవార్త
శ్రీకాళహస్తి నియోజకవర్గాన్ని ఐదేళ్ళ పాటు పరిపాలించిన వైకాపా పాలకులు రోడ్లమీద తట్టెడు మట్టి పోయలేదు.ఏడాదిలో శ్రీకాళహస్తి నియోజకవర్గ ప్రజలకు రూ.50కోట్లతో రోడ్లను నిర్మించామని శాసనసభ్యుడు వెంకటసుధీర్‌రెడ్డి అన్నారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రచారానికి వెళ్ళినపుడు రోడ్ల దుస్థితిని చూసాను. రోడ్ల మీద నడవాలంటే ఎక్కడ రోడ్డు ఉందో ఎక్కడ గుంత ఉందో తెలియని స్థితి. ఆ నాడే అనుకున్నా గెలిచిన తరువాత మొదటి ప్రాధాన్యత రోడ్ల బాగుకు ఇవ్వాలని దాంతో ప్రధాన రోడ్లతో పాటు గ్రామీణ రోడ్ల దుస్థితి జాబితాను తయారు చేసుకున్నా ఏడాదిలో సుమారు రూ.20కోట్లు నియోజకవర్గంలోని రోడ్ల బాగుకు నిధులు సాధించానని స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి వివరించారు. శ్రీకాళహస్తి-కాసరం (కెకెజి) రోడ్డును ప్రారంభించారు. రూ.1.6కోట్లుతో నిర్మించిన తారు రోడ్డును ఆయన ప్రారంభించారు. ఎంఎల్ఏ మాట్లాడుతూ శ్రీకాళహస్తి నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చి దిద్దుటకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నామని వివరించారు. శ్రీకాళహస్తికి నిధులు కేటాయించటంలో జిల్లా కలెక్టర్ ఎస్ వెంకటేశ్వ రన్‌సహకారం మరువరానిదన్నారు. సుమారు రూ.20కోట్ల తారు రోడ్లు ప్రధానమైనవి నిర్మించామని వివరించారు. నేడు శ్రీకాళహస్తి-కాసరం,రేణిగుంట నుంచి సూరప్ప కేసం రోడ్డు రూ.1.13కోట్లుతో నిర్మించినవి ప్రారంభించామని వివరించారు. శ్రీకాళహస్తి పట్టణం లోకి వచ్చే రోడ్డును అలాగే పాపానాయుడుపేట నుంచి గుడిమల్లం రోడ్డుతో పాటు ఆరులేన్ల రోడ్లు నియోజకవర్గం నుంచే వెళుతుందని ఎంఎల్ఏ సుధీర్‌రెడ్డి వివరించారు. కాగా రూ.27కోట్లతో శివం టు శివం రోడ్డును చేపట్టామన్నారు. గతంలో శ్రీకాళహస్తి నుంచి కాసరం వెళ్ళాలంటే గతుకుల రోడ్డుపై కనీసం ఒకటిన్నర గంట పట్టేది నేడు కేవలం అర్ధగంటలో చేరుకునే విధంగా తారు రోడ్డును నిర్మించామన్నారు. ఈ కార్యక్రమాల్లో మాజీ శ్రీకాళహస్తి వ్యవసాయమార్కెట్ కమిటి చైర్మెన్ రంగినేని చెంచయ్యానాయుడు మాజీ మండల పార్టీ అధ్యక్షుడు గాలి మురళి నాయుడు, రావిళ్ళ మునిరాజానాయుడు,రవీంద్రరెడ్డి,గుండేలుగుంట సర్పంచ్ పుల్లారెడ్డి, కొత్తకండ్రిగ మంగారెడ్డి,ఆర్అండ్ బి అధికారులు పాల్గొన్నారు.



## విలువలతో కూడిన జీవన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలి



*శ్రీకాళహస్తిరూరల్, జూన్ 11 ప్రభాతవార్త* విద్యార్థులు గ్రామాల్లో విలువలతో కూడిన జీవన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని ప్రముఖ మానసిక నిపుణుడు డాక్టర్ సుధాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఏర్పేడు మండలంలోని ఎ స్ఓ ఎస్ బాలల గ్రామంలో కుటుంబబలోపేత కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలువలతో కకూడిన జీవన నైపుణ్యాల శిక్షణను నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో వంద మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.శిక్షణలో డాక్టర్ సుధాకర్‌రెడ్డి స్వయం అవగాహన, కమ్యూనికేషన్స్ నైపుణ్యాలు, భావోద్వేగ నియంత్రణ, నిర్ణయాల తీసుకోవటం, సమస్యల పరిష్కారం, విమర్శనాత్మక ఆలోచన,సంబంధాల నిర్వహణ అనే అంశాల్లో నైపుణ్యాలు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి మంచినీతి మరియు మానవీయ విలువలతో కూడిన వ్యక్తిత్వాన్ని నిర్మించుకునేందుకు తోడ్పతాయని వివరించారు. ఎస్ఓఎస్ సంస్థ పిల్లల శారీరక, మానసిక మరియు నైతిక అభివృద్ధికి కట్టుబడి పని చేస్తుందని వివరించారు.ఈ శిక్షణ ద్వారా కార్యక్రమం ద్వారా జీవన నైపుణ్యాలపై అవగాహన కల్పించటంవిలువల పట్ల చైతన్యం పెంచటం ప్రధాన లక్ష్యమన్నారు.

## కల్లిపూడి జాతరలో అమ్మవారికి సారె



*తొట్టంబేడు,జూన్ 11 ప్రభాతవార్త* జాతరలుమన సంప్రదాయాలు,సంస్కతిని భావి తరాలకు అందించే సాధనాలని బొజ్జల రిషితారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని కల్లిపూడి గ్రామంలో జరుగుతున్న జాతర సందర్భంగా గ్రామ దేవతకు శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి రిషితారెడ్డి సంప్రదాయ బద్ధంగా భక్తి శ్రద్దలతో సారెను అందించారు.ఈ సందర్భంగా ఆ మెకు గ్రామస్థులు ఘనస్వాగతం పలికారు. మేళ తాళాలు,తప్పెట్ల మోతతో నాట్యాలు చేసుకుంటూ ఆమెను ఆలయం వద్దకు స్వాగతం పలికారు. గ్రామాల్లో జాతర సంబరాలు చోటు చేసుకున్నాయి. ప్రతి గ్రామంలోనూ జాతరల సందర్భంగా రాజకీయ నాయకులు హాజరౌతూ కొత్తదనాన్ని ఉత్సాహాన్ని నింపుతున్నారు. రిషితారెడ్డితో పాటు మండల పార్టీ అధ్యక్షుడు రావిళ్ల మునిరాజానాయుడు మాజీ మున్సిపల్ వైస్‌చైర్మెన్ మిన్నల రవి, పేట బాలాజిరెడ్డి,పట్టణ పార్టీ మహిళా అధ్యక్షురాలు సుమతి, మల్లీశ్వరమ్మ తదితరులున్నారు. అమ్మవారిని దర్శించుకున్న ఆమెకు ఆలయ మర్యాదలతో పూజారి స్వామి అమ్మవార్ల పసుపు కుంకుమ గాజులు ప్రసాదంగా అందించారు

## మంత్రి బండి సంజయ్ కి స్వాగతం పలికిన పి సి రాయులు

*తిరుపతి విద్య జూన్ 11 ప్రభాత వార్త* భారత ప్రభుత్వ పౌర విమానయాన మంత్రిత్వ శాఖ విమానాశ్రయ సలహా కమిటీ సభ్యుడు డాక్టర్ పి.సి.రాయులు బుధవారం తిరుపతికి అధికారిక పర్యటనకు వచ్చిన గౌరవనీయులైన కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కి తిరుపతి విమానాశ్రయంలో స్వాగతం పలుకుతున్నారు.

## గరుడ సేవలో పాల్గొన్న మాజీ మంత్రి ఆర్.కె.రోజా

**వడమాలపేట, జూన్ 11 ప్రభాతవార్త :** అప్పలాయగుంట శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి జరిగిన గరుడ సేవలో పర్యాటక శాఖ మాజీ మంత్రి ఆర్.కె.రోజా పాల్గొన్నారు. ఆలయ అధికారులు ఆమెను సాదరంగా ఆహ్వానించగా వేద మంత్రోచ్చారణల నడుమ వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. మంగళ వాయిద్యాలు, భజనలు, కోలాటాల నడుమ ఆలయ మాడ వీధుల్లో నేత్రపర్వంగా సాగిన గరుడ వాహన సేవలను తిలకించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గరుడుని సేవా దృక్పథం, మాతృభక్తి, ప్రభు భక్తి, సత్య నిష్ఠ, నిష్కళంకత సమాజానికి స్ఫూర్తిదాయకాలని పేర్కొన్నారు. గరుడ వాహనంపై విహరిస్తున్న స్వామివారిని దర్శిస్తే మోక్షం సిద్ధిస్తుందని భక్తుల విశ్వాసమని తెలిపారు. గరుడ వాహన సేవ రోజున స్వామిని దర్శించుకోవడం చాలా సంతోషంగా వుందన్నారు. కార్యక్రమంలో ఆమెతో పాటు స్థానిక వైఎస్సార్‌సిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన ఎమ్మెల్యే నాని

పాకాల, జూన్ 11, ప్రభాతవార్త
పాకాల మండల పరిధిలోని రమణయ్యగారి పల్లి, ఊటువంక, మొగరాల పంచాయతీలలో సుమారు 3 కోట్ల 22 లక్షల రూపాయలతో నిర్మించిన సీసీ రోడ్డులను బుధవారం రోజున చంద్రగిరి ఎమ్ఎల్ఏ పులివర్తి నాని ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఊరందూరు దళితవాడలో పాండురంగస్వామి తిరునాళ్లు



*శ్రీకాళహస్తిరూరల్,జూన్ 11 ప్రభాతవార్త* శ్రీకాళహస్తి మండలం ఊరందూరు గ్రామ దళిత వాడలో బుధవారం అగ్నిగుండ ప్రవేశం భక్తి శ్రద్దలతో నిర్వహించారు. ఇక్కడ రుక్మిణి సమేత పాండురంగస్వామి 59వ ఆనంద అగ్నిగుండం మహోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు.ఈ కార్యక్రమాలకు ముఖ్యఅతిధిగా శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి మాజీ అధ్యక్షులు అ ంజూరు తారక శ్రీనివాసులు హాజరయ్యారు. యువకులు ఉత్సాహంగా అగ్నిగుండ ప్రవేశం చేసారు.ఈ సందర్భంగా వాడను సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దారు. విద్యుత్ దీపాల కాంతితో ముస్తాబు చేసారు. నిత్యకళ్యాణం పచ్చతోరణంలా తలంకరించారు.ఈ కార్యక్రమాల్లో వైకాపాకు చెందిన కోగిల సుబ్రమణ్యం, మాజీ కౌన్సిలర్ ఉత్తరాది శరవణ కుమార్ కంఠా ఉదయ్‌కుమార్, పెరుమాళ్ చౌదరి, మునికుమార్, దళితవాడకు చెందిన రంగయ్య, అరుణాచలం, లోకేష్,సుబ్బయ్య, మనోజ్,సంజీవయ్య, గిరి, రాం చరణ్ నగేష్, ప్రసాద్, వినోద్ దాసు, సుబ్రమణ్యం, చెంచుకృష్ణ, మోహన్, వివేక్, భాను, చంద్రశేఖర్, ఆర్.ముని, శ్రీనివాసులు, గాంధీ, సునీల్ గెడి, రమణయ్యధనంజయ్యులు, బాబు,సందీప్, ఉదయ్,సుధీర్, సూర్య నిర్వహిస్తు అతిధికి స్వాగతం పలికారు.

## కేంద్ర హోం సహాయ మంత్రి బి. సంజయ్ కుమార్‌కి ఘన స్వాగతం

*తిరుపతి కార్పొరేషన్, జూన్ 11, ప్రభాతవార్త* కంద్ర హోం సహాయ మంత్రి బి. సంజయ్ కుమార్‌కి జిల్లా ఎస్పి హర్షవర్ధన్ రాజు ఘన స్వాగతం పలికారు. బుధవారం పోలీస్ పేరేడ్స్ గ్రౌండ్ నందు జిల్లా ఎస్పి వి. హర్షవర్ధన్ రాజు పుష్పగుచ్చం ఇచ్చి ఘన స్వాగతం పలికారు. అనంతరం పోలీస్ పేరేడ్స్ గ్రౌండ్ నందు గౌరవ కేంద్ర హోం సహాయ మంత్రి బి. సంజయ్ కుమార్ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు కె. రావిమనోహరచారి, శాంతి భద్రతలు,నాగభూషణం రావు క్రైమ్స్, శ్రీనివాసరావు ఆర్మడ్ రిజర్వుడ్, డీఎస్పీలు భక్తవతలం, శ్యామ్ సుందర్, రామకృష్ణా చారి, చిరంజీవి ఆర్మడ్ రిజర్వుడ్, సిఐలు వినోద్ కుమార్, సైబర్ క్రైమ్స్ ఈశ్వర్ కమండ్ కంట్రోల్, ఆర్ఐలు రాజశేఖర్ రెడ్డి, రమణారెడ్డి, పోతారాజు, హరికృష్ణ, ఎస్టీ ఎఫ్, సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## బండి సంజయ్‌కు ఘనస్వాగతం



*శ్రీకాళహస్తి, జూన్ 11 ప్రభాతవార్త* కేంద్ర హోం శాఖ మంత్రి తిరుపతి జిల్లా పర్యటనకు వచ్చిన సందర్భంగా ఆయనకు రాష్ట్ర బిజెపి కార్యదర్శి కోలా ఆనంద్‌కుమార్ వారి సహచరులు ఘనస్వాగతం పలికారు. బిజెపి పార్టీని శ్రీకాళహస్తి నియోజకవర్గంలో అత్యధిక సభ్యత్వంతో నడిపిస్తున్న కోలా ఆనంద్‌కుమార్‌కు కేంద్ర మంత్రులు,పార్టీలో సత్స బంధాలున్నాయి. ఈ నేపధ్యంలో పరిచయాలున్నాయి. బుధవారం కకేంద్రహోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ రాక సందర్భంగా ఆయన్ను ఘనస్వాగతం పలికారు. శ్రీకాళహస్తీశ్వరుని తీర్థ ప్రసాదాలు అందించారు. అభిమానులు ఇద్దరిని ఒకే గజమాలలో సత్కరించారు.

## కాంగ్రెస్ గోడపత్రికల ఆవిష్కరణ



*శ్రీకాళహస్తి, జూన్ 11 ప్రభాతవార్త* ఈ నెల 13న శ్రీకాళహస్తికి వస్తున్న కాంగ్రెస్ అధ్యక్షురాలు వైయస్ షర్మిల సభను జయప్రదం చేయాలని కోరుతూ ముద్రించిన గోడ పత్రికలను బుధవారం ఆవిష్కరించారు.రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయటానికి కార్యకర్తల్లో ఉత్సాహం నింపటానికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై కార్యకర్తలను ఉత్తేజ పరచి ఉత్సాహం నింపటానికి షర్మిల పర్యటనకు సంబంధించి గ్రామాల్లో విస్తృత ప్రచారం చేయటానికి గోడపత్రికలను ముద్రించారు. ఈ గోడ పత్రికలను నియోజకవర్గ ఇన్‌చార్జి తలపా దామోదర్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసారు. జిల్లా అధ్యక్షులు బాలగురవం బాబు కళిందర్, శబరి రాజన్, గురుమూర్తి, సీతారాం, భాస్కర్‌యాదవ్, భాస్కర్‌రెడ్డి, అంటోని చందు తదితరులు పాల్గొన్నారు.

## శివయ్య సేవలో ఎంఎల్‌సి



*శ్రీకాళహస్తి, జూన్ 11 ప్రభాతవార్త* దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహస్తీశ్వరాలయానికి అతిధుల తాకిడి పెరుగుతుంది. బుధవారం విజయనగరం ఎంఎల్‌సి కావలి గ్రీష్మ ప్రసాద్ కుటుంబసభ్యులో స్వయంభువు వాయులింగేశ్వరుని దర్శించుకున్నారు.వారికి ఆలయ మర్యాదలతో దక్షిణ గోపురం వద్ద ఎపిఆర్ఓ రవి స్వాగతం పలికారు.స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం తరువాత ఆలయ మర్యాదలతో మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వారికి వేదపండితులతో ప్రత్యేక దర్శనాలతో పాటు స్వామిఅ మ్మవార్ల తీర్థ ప్రసాదాలను అందించారు.

## విద్యార్థులకు కొత్త పాసులు 14న జారీ

*శ్రీకాళహస్తి, జూన్ 11 ప్రభాతవార్త* శ్రీకాళహస్తి ఏపియస్‌ఆర్‌టి డిపోలో విద్యార్థులకు ఈ నెల 14 కొత్త పాసులు జారి చేయబడుతుందని డిపో మేనేజర్ టి.మునిచంద్ర బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.ఈ నెల 12,13 వతేదుల్లో పాసులు జారి చేయబడవని వివరించారు. ఈ నెల 12 నుంచి పాఠశాలు పునఃప్రారంభం కానున్నాయి. ఈ నేపధ్యంలో విద్యార్థులు గ్రామాల నుంచి రావటానికి ఇబ్బంది పడతారని అయితే కొత్త పాసులు 14న జారి చేయబడతాయని తెలిపారు.పదవ తరగతి కంటే పై చదువులు చదివే విద్యార్థులు 10వ తరగతి మార్కుల జాబితా,ఆధార్‌కార్డు, ఫోటో,స్టడీ సర్టిఫికేట్, పదవతరగతి చదివే విద్యార్థులు ఆధార్‌కార్డు, ఫోటో,స్టడీ సర్టిఫికేట్ సమర్పించాల్సి ఉంటుందన్నారు.విద్యార్థులు ఈ అంశాన్ని గుర్తించాలన్నారు.

## స్విమ్స్‌సారధ్యంలో క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టులు



*శ్రీకాళహస్తి, జూన్ 11 ప్రభాతవార్త* శ్రీకాళహస్తి రోటరి క్లబ్ సారధ్యంలో బుధవారం తిరుపతి స్విమ్స్ చే ఉచిత క్యాన్సర్‌స్క్రీనింగ్ టెస్టను నిర్వహించారు. అలాగే మహిళలకు మామోగ్రామ్, పాప్ స్మియర్ పరీక్షలు నిర్వహించారు.శ్రీకాళహస్తి రోటరీ క్లబ్ తిరుపతి స్విమ్స్ సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమాలకు జనం నుంచి విశేష స్పందన వచ్చింది. ఉచిత శిబిరంలో సుమారు వందమందికి పైగా వైద్యపరీక్షలు జరుపుకున్నారు. పింక్ బస్సుల్లో మహిళలు, పురుషులకు నోటి క్యాన్సర్ పరీక్షలు మహిళలకు రొమ్ముక్యాన్సర్ నిర్ధారణకు మామోగ్రామ్, గర్భాశయ ముఖద్వాం క్యాన్సర్ నిర్ధారణ కోసం పాప్‌స్మియర్ పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. ఈ శిబిరంలో స్విమ్స్ డైరెక్టర్ కమ్ వైస్ ఛాన్సలరన ఆర్వి కుమార్, సూచనలతో కమ్యూనిటి మెడిసిన్ విభాగాదిపతి డాక్టర్ కె.నాగరాజ్ పర్యవేక్షించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ జి.హరిత, పిఆర్ఓ డి.చంద్రమోహన్,,రోటరీ అధ్యఓలు శైలజ కార్యదర్శి సిద్దులుగారి ప్రసాద్, క్లబ్ సభ్యులు కండ్రిగ ఉమా,పాపగారి జనార్ధన్, వవెంకటమునిి, పార్థసారధి, కృష్ణ కుమార్, వేణుగోపాల్, బాలాజి, జనిత, సుబ్రమణ్యం, డాక్టర్ నారాయణ,డాక్టర్ వవెంకటరామన్, అనూరాధ, సుబ్రమణ్యంరెడ్డి, ప్రమీల,కళ్యాణి, పింక్‌బస్సు సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యను వ్యాపారం చేయొద్దు!



*శ్రీకాళహస్తి, జూన్ 11 ప్రభాతవార్త* సమాజంలో విద్య వ్యాపార రంగంగా మారిందని ఎఐఎస్‌ఎఫ్ తిరుపతిజిల్లా సహాయ కార్యదర్శి కొగిలి మునిచంద్ర బుధవారం అన్నారు.ఆయన వారి సహచరులతో కలసి మండల విద్యాశాఖాదికారి బాలయ్యకు వినతి పత్రం సమర్పించారు.విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లో సకల సదుపాయాలు, అర్హతకల్గిన ఉపాధ్యాయులున్నా లెక్కచేయక కార్పొరేట్ పాఠశాలలు కళాశాలల మీద మోజు పడుతున్నారని దాంతో అక్కడ ఇష్టారాజ్యంగా ఫీజుల మోత మోగుతుందని వివరించారు.దీనిని ప్రభుత్వం కట్టడి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని వివరించారు. కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజులను నియంత్రించాలని కోరారు. అలాగే యూనిఫారాలు, పుస్తకాల పేరుతో వేలాది రూపాయలు గుంజుకుంటూ పబ్బం గడుపుకుంటున్నారని ఫిర్యాదు చేసారు. వినతి పత్రం అందించారు.ఈ కార్యక్రమాల్లో ఏరియా అధ్యక్షులు శివ,తేజ,సంతోష్, అభి,వేణు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తీశ్వరాలయ ఉద్యోగుల బదిలీలు

శ్రీకాళహస్తి, జూన్ 11 ప్రభాతవార్త
ప్రభుత్వ ఆదేశాల మేరకు దేవాదాయశాఖలో బదిలీల జాతర చోటు చేసుకుంది. ఈ నేపధ్యంలో మంగళవారం అందిన సమాచారం మేరకు ఐదుగురు అధికారులు,సిబ్బందికి బదిలీ ఉత్తర్వులు అందాయి. ఇక్కడ పని చేస్తున్న ఎఇఓ సతీష్‌మాలిక్‌ను శ్రీశైలం భ్రమరాంబమల్లికార్జున్ స్వామి ఆలయానికి బదిలీ చేసారు. మరో ఎఇఓ ఎకే ధనపాల్‌ను కాణిపాకం కు బదిలీ చేసారు. ఆయన ఇక్కడ వివాదాల్లో సస్పెండ్ అయి కీన్‌చిట్ సాధించి కాణిపాకంకు బదిలీ చేయమని కమిషనర్ కార్యాలయానికి మొరబెట్టుకున్నారు.ఈ నేపధ్యంలో సాధారణ బదిలీల్లో ఆయన కోరుకున్న స్థానం లభించింది.సూపరింటెండెంట్ బి.విజయసారధి, బి.కళ్యాణిల బదిలి చేసారు. విజయసారధిని శ్రీశైలంకు బదిలీ చేయగా కళ్యాణినిని శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి విజయవాడకు బదిలి చేసారు. కాగా జూనియర్ అసిస్టెంట్ సురేష్‌రెడ్డిని శ్రీశైలంకు బదిలి చేయగా అక్కడ పని చేస్తున్న జూనియర్ అసిస్టెంట్ టి.ఏడుకొండలను శ్రీకాళహస్తికి బదిలి చేసారు.కాగా ఇద్దరుఎఇఓలను బదిలి చేయగా ఒకరిని శ్రీశైలం నుంచి ఇక్కడకు బదిలి చేసారు. గతంలో ఇక్కడ పని చేసిన మోహన్‌ను తిరిగి ఇక్కడకు బదిలి చేస్తూ ఉత్తర్వులు జారి చేసారు. ఇతర ఉద్యోగులుఎవ్వరూ బదిలి కాలేదు

# ఎన్డీఏ ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తోంది

తిరుపతి విద్య, జూన్ 11 ప్రభాతవార్త
ఎన్డీఏ ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తుంది అని పతి ఒక్క తల్లితండ్రులు మీ పిల్లలను పాఠశాలకు పంపించాలి అని పిలుపునిచ్చారు.స్తానిక కాటన్ మిల్ గేట్ సమీపం లో ఒకటవ డివిజన్ పరిధిలోని పద్మావతినగర్ లో నిర్మించిన ఎంపిపి స్కూల్ ను బుధవారం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు,కమిషనర్ నారపురెడ్డి మౌర్య ప్రారంభించారు.స్కూల్ ఆవరణను ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు.ఎన్డీఏ కూటమి వచ్చిన వెంటనే స్కూల్ పనులు ప్రారంభించి ఏడాది లోపే ప్రారంభించుకోవడం విద్యకు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతకు నిదర్శనమని తెలిపారు.విద్యారంగాన్ని అభివృద్ధిపరిచి నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్,విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ లు కృషి చేస్తున్నట్లు ఆయన చెప్పారు.డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర పథకం కింద ఐదవ తరగతి నుంచి పదవ తరగతి వరకు విద్యాసామాగ్రిని విద్యార్థులకు ఉచితంగా ప్రభుత్వం అందిస్తున్నదని ఆయన తెలిపారు.పేదరికం చదవుకు అడ్డు రాకూడదని తల్లికి వందనం పథకాన్ని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిందని ఆయన చెప్పారు.ఈ పథకం నిధులను నేరుగా విద్యార్థుల తల్లుల ఖాతలకు గురువారం స్కూల్స్ ప్రారంభం సందర్భంగా ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం జమ చేస్తుందని ఆయన తెలిపారు కమిషనర్ ఎన్.మౌర్య మాట్లాడుతూ తిమ్మినాయుడుపాలెం మాస్టర్ ప్లాన్ రోడ్డు వేయడంతో స్కూల్ భవనం తొలగించారని అన్నారు.అందుకు ప్రత్యామ్నాయంగా చింతలచేను వద్ద స్కూల్ నిర్మించాలని అన్నారు.అభివృద్ధి పనుల్లో భాగంగా మండల పరిషత్ స్కూల్ భవన నిర్మాణ పనులు శరవేగంగా పూర్తి చేసి ప్రారంభించామని అన్నారు.ఒకటి నుండి ఐదవ తరగతి వరకు 60 మంది విద్యార్థులు ఉన్నారన్నారు.వీరందరి ఒక్కో క్లాస్ కు ప్రత్యేకంగా ఒక్కో గది ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నగర ప్రధాన కార్యదర్శి మహేష్ యాదవ్, జనసేన నగర అధ్యక్షులు రాజారెడ్డి, కృష్ణ యాదవ్, మున్సిపాలిటీ సిబ్బంది, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



# తిరుపతి డివిజన్

## పేరూరు పంచాయితీలో...వైసీపీ నేతల దౌర్జన్యం

- రిజిష్టర్ భూమిని సైతం కబ్జా చేసెందుకు ప్రయత్నాలు
- న్యాయం చేయాలని బాధితురాలు మాధవిలత, కుటుంబ సభ్యులు విజ్ఞప్తి



*తిరుపతి హెల్త్, జూన్ 11 ప్రభాతవార్త :* వైసీపీ పాలన పోయినా చంద్రగిరి నియోజక వర్గం పేరూరు పంచాయితీలో మాత్రం వైసీపీ నేతలు, కార్యకర్తల దౌర్జన్యాలకు హద్దూపద్దూ లేకుండా పోతోందని, చివరికి తాము రిజిస్టర్ చేసుకున్న భూమిని సైతం కబ్జా చేయటానికి ప్రయత్నిస్తున్నారని బాధితులు మాధవిలత కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాధితురాలు మాధవి లత, కుటుంబ సభ్యులు మాట్లాడారు. స్వర్గీయ మాజీ ఎంపీ శివప్రసాద్ దగ్గర సర్వే నెంబరు 529/4ఏలో 30 సెంట్ల భూమిని తనతో పాటు మరో ముగ్గురు కొనుగోలు చేసి 1996లో చంద్రగిరిలో రిజిష్టర్ చేసుకోవడం జరిగిందన్నారు. అటు పిమ్మట అందులో షెడ్లు వేసి కరెంటు మీటరు, పంచాయితీకి పన్ను కట్టడం జరిగిందన్నారు. అయితే గతంలో పక్క భూమికి చెందిన రాజేంద్ర నాయుడు ప్రోద్బలంతో కొంత మంది రౌడీ మూకలు షెడ్లును కూలదోయడం జరిగిందనీ, దీనిపై కోర్టు వెళితే తమకు అనుకూలంగా న్యాయమూర్తి జడ్జిమెంట్ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రస్తుతం ఆ భూమిని చదును చేసి ఇండ్లు కట్టుకునేందుకు వెళ్ళామని, అయితే ప్రస్తుత వైసీపీ పేరూరు సర్పంచ్ కేశవులు, ఎంపీపీ మూల చంద్రమౌళిరెడ్డి అలియాస్ మూలం బాబు, వైస్ ఎంపీపీ మాధవరెడ్డి, మరో వైసీపీ నేత చెంచు మోహన్ యాదవ్ కొంత మంది రౌడీ మూకలు వచ్చి మా భూమిని కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే వెంటనే స్పందించి వారిపై తగు చర్యలు తీసుకోవడంతో పాటు తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాధవీలతతో పాటు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## బండి సంజయ్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన తిప్పారెడ్డి

తిరుపతి విద్య జూన్ 11 ప్రభాత వార్త



తిరుమల పర్యటన నిమిత్తం తిరుపతికి విచ్చేసిన కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ను నగరంలోని గ్రాండ్ ఫార్చ్యూన్ కెన్సెస్ హోటల్ నందు మర్యాదపూర్వకంగా కలిసిన డాక్టర్ అంబేద్కర్ గ్లోబల్ లా ఇన్స్టిట్యూట్ చైర్మన్ డాక్టర్ తిప్పారెడ్డి. తిప్పారెడ్డి మాట్లాడుతూ ఇటీవల పాకిస్తాన్ ఉగ్రవాదులు పహల్గాంలో జరిపిన కాల్పుల్లో 26 మంది ప్రాణాలు కోల్పోవడం దురదృష్టకరం.మోడీ నాయకత్వంలో ఇండియన్ ఆర్మీ పాకిస్తాన్లోని 9 ఉగ్రవాద స్థావరాలపై దాడులు చేసి ధ్వంసం చేశారు.ఆ సందర్భంలో కేంద్ర హోంశాఖ క్రియాశీలకంగా వ్యవహరించందని కొనియాడారు.తెలుగు రాష్ట్రాల నుండి హోం శాఖ సహాయ మంత్రిగా బండి సంజయ్ కొనసాగడం శుభపరిణామం అన్నారు.

## కూటమి ప్రభుత్వం అభివృద్ధికే పట్టం

ప్రారంభోత్సవాలతో పులివర్తి బిజీ



*చంద్రగిరి, జూన్ 11 ప్రభాతవార్త:* కూటమి ప్రభుత్వం అభివృద్ధికే పట్టం కడుతుందని ఎంఎల్ఏ పులివర్తి నాని అన్నారు. స్థానిక అక్కగార్ల కాలనీలో ఎంఎల్ఏ, జడ్పీటిసి చిల్లకూరి యుగంధర్ రెడ్డి సంయుక్తంగా 60 కిలో లీటర్ల సంప్ నుండి మంచినీటి సరఫరాను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఉద్దేశించిన సంప్‌తో పాటు పాతపేటలోని ప్రజలకు మంచినీటి సరఫరా కొరకు పైప్‌లైన్, ఓవర్‌హెడ్ ట్యాంక్‌ను ప్రారంభించినట్లు వివరించారు. కూటమి ప్రభుత్వం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ అభివృద్ధి, సంక్షేమాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గ సమగ్రాభివృద్ధి లక్ష్యంగా ప్రతి అవకాశాన్ని అందిపుచ్చుకుని ప్రజలకు సేవలందించనున్నట్లు తెలిపారు. అనంతరం గోవిందధామం నిర్మాణ పనులను పరిశీలించి, మహాప్రస్థానం కమిటీకి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అభివృద్దే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందడుగు



*రామచంద్రాపురం, జూన్ 11 ప్రభాతవార్త:* అభివృద్దే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందడుగులు వేస్తున్నట్లు ఎంఎల్ఏ పులివర్తి నాని అన్నారు. బుధవారం కోదండ రామాపురంలో నూతనంగా నిర్మించిన సిసి రోడ్డును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామానికి పూర్తి స్థాయిలో సిసి రోడ్లు, మురుగునీటి కాలువలు, మంచినీటి సౌకర్యం కల్పించడమే ప్రధాన లక్ష్యమన్నారు. నిధులు లేకున్నప్పటికీ కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి రెండిటినీ పూర్తి స్థాయిలో కొనసాగిస్తున్నట్లు వివరించారు. వచ్చే నాలుగేళ్ళలో నియోజకవర్గాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి కేశవులు నాయుడు, చిత్తూరు పార్లమెంటరీ పార్టీ అధ్యక్షుడు చినబాబు, రామచంద్రాపురం పరిశీలకుడు మునిశేఖర్ రాయల్, నాయకులు కొట్టే నరశింహారెడ్డి, కోరా హరిప్రసాద్, మునిరామిరెడ్డి, సురేంద్ర నాయుడు, రంజిత్, ధనంజయ రెడ్డి, గిరిధర్ రెడ్డి, ముద్దుకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రిని కలసిన కాయం హరినాధ్ రెడ్డి

రామచంద్రాపురం, జూన్ 11 ప్రభాతవార్త:



కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కి బిజెపి జిల్లా కార్యదర్శి కాయం హరినాద్ రెడ్డి బుధవారం తిరుపతిలో పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన జిల్లాలోని పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకు వచ్చారు. దేశ రక్షణలో ప్రదాని నరేంద్రమోడీ తీసుకుంటున్న నిర్ణయాలు అభినందనీయమని కొనియాడారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటి సంరక్షించాలని మంత్రి నాయకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రమాదకరంగా మారిన ప్రయాణం



*పాకాల, జూన్ 11, ప్రభాతవార్త* పాకాల మండల పరిధిలో పాకాల, నేద్రగుంట రైల్వే లెవెల్ క్రాసింగ్‌ల వద్ద రైల్వే వారు ఈ మధ్యకాలంలో కొత్తగా బ్రాడ్ గేజి లైనుకు ఉపయోగించే సిమెంటు స్లిప్పర్ దిమ్మెలను తీసుకుని వచ్చి స్పీడ్ బ్రేకర్లుగా రోడ్డుపై అడ్డంగా పరిచి కొద్ది పాటి తారువేసి ఎత్తు ఎక్కువ వెడల్పు తక్కువగా బ్రేకర్లు వేయడంతో ఈ మార్గం గుండా ప్రయాణించే వాహనాలు స్పీడ్ బ్రేకర్లు దాటడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు చేయడంలో నియమాలు పాటించకుండా వేయడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇక తిరుపతి రోడ్‌లో చర్చి గేటు వద్ద స్పీడ్ బ్రేకర్ పై ఇసుక మేట వేయడంతో వాహనదారులు రోడ్డు పై జారి పడి తరచూ ప్రమాదాలు గురవుతున్నారు. దీనిపై రైల్వే అధికారులు దక్షిణం స్పందించి స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయడంలో నిబంధనలు పాటించవలసినదిగా ప్రజలు మరియు వాహనదారులు కోరుతున్నారు.

## ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించిన రెడ్డి రామరాజు



*పాకాల, జూన్ 11, ప్రభాతవార్త* ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల పాకాల నందు ఐరాల ప్రభుత్వ జూనియర్ కళాశాల నుండి బదలీ పై వచ్చిన రెడ్డి రామరాజు బుధవారం ప్రిన్సిపాల్‌గా పదవిబాధ్యతలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జూనియర్ అధ్యాపకుల సంఘ అభ్యర్థులు రవి, కళాశాల నుండి బదలిపై వెళ్లిన బేబీశ్వర రెడ్డి నూతనంగా వచ్చిన ప్రిన్సిపాల్ ను అభినందించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు విద్యార్థినులు పాల్గొన్నారు.

## ఎస్పీ డబ్ల్యు జూనియర్ కళాశాలకు నాలుగు ప్రతిభా అవార్డులు కైవసం



*తిరుపతి విద్య జూన్ 11 ప్రభాత వార్త* ప్రభుత్వం ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినిలకు షైనింగ్ స్టార్స్ పేరుతోప్రకటించిన ప్రతిభా అవార్డులలో శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాలకు చెందిన నలుగురు విద్యార్థినిలకు రావడం జరిగినది వీరికి తిరుపతి మహతి ఆడిటోరియంలో ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ మరియు రిజిస్ట్రేషన్ శాఖా మాత్యులు మరియు తిరుపతి జిల్లా ఇంచార్జ్ మంత్రివర్యులు అనగాని సత్య ప్రసాద్ చేత 20వేల రూపాయలు చెక్కు, ప్రశంసా పత్రం అందించి ప్రశంసించడం అయింది.ప్రతిభా అవార్డ్స్ పొందిన విద్యార్థినిలు గంగా మానస,మలిశెట్టి నందలక్ష్మి,తణుకు పద్మిత,కొత్తపల్లి ఇందుప్రియ,వీరిని టిటిడి విద్యాధికారి వెంకట సునీల్,ఇంచార్జ్ ప్రిన్సిపాల్ డా.సరస్వతి, అడ్మిషన్స్ సంచాలకులు ఉదయ్,అధ్యాపకులంతా అభినందించారు

## గంగమ్మ తల్లికి పసుపు, కుంకుమ, పట్టు సారె వితరణ

పుత్తూరురూరల్/నారాయణవనం, జూన్ 11 ప్రభాతవార్త :



పుత్తూరు మునిసిపాలిటీ పరిధి బత్తలవారికండ్రిగ(సిటిఆర్‌నత్తం)లో గత రెండురోజులుగా గంగజాతర వేడుకలు అంగరంగ వైభవంగా జరుగుతున్నది. ఉత్సవాల్లో భాగంగా బత్తవారికండ్రిగ మాజీ సర్పంచ్ సొరకాయలస్వామి(తాతయ్య) గంగమ్మతల్లి అమ్మవారికి ఆనవాయితీ అందజేసే పసుపు, కుంకుమ, పట్టుసారెను అందజేశారు. మాజీ సర్పంచ్ ఇంటి నుంచి మేళతాళాలు, మంగళవాయిద్యాలు, ఊరేగింపుగా వెళ్లి అందజేశారు. గత కొన్నేళ్లుగాగంగమ్మతల్లికి అందజేస్తున్నట్టు మాజీ సర్పంచ్ తెలిపారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేకపూజలు చేసిన తరా్వత కుటుంబసమేతంగా దర్శనం చేసుకున్నారు.

# రోడ్డు నిర్మాణాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

ఓజిలి, జూన్ 11 ప్రభాతవార్త : గ్రామాల అభివృద్ధి జరుగుతుందంటే ఒక తెలుగుదేశం పార్టీకే సాధ్యం అవుతుందని సులూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. బుధవారం ఓజిలి మండలం నాయకులతో కలిసి కర్ర బల్లవోలు ఆర్అండ్‌బి రోడ్డు నుండి బట్ల కనుపూరు మీదుగా అయ్యవారిపాలెం ఆర్ అండ్ బి రోడ్డు వరకు రెండు కిలోమీటర్లు 8 కోట్ల 38 లక్షల రూపాయలతో తారు రోడ్డు నిర్మాణం పూర్తి చేసుకుని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతి మారుమూల గ్రామాన్ని గుర్తించి రహదారులు ఏర్పాటు చేయడం సంతోష్ దాయకమన్నారు. వాహనదారులు సురక్షితంగా పట్టణ ప్రాంతాలకు వెళ్లాలని ముఖ్య ఉద్దేశంతో రహదారులు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు గడిచిన వైసిపి ప్రభుత్వ హయాంలో ఎక్కడ కూడా రహదారుల గురించి పట్టించుకున్న పాపాన పోలేదు అన్నారు. రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధిచేగా తీసుకెళుతున్న చంద్రబాబు నాయుడుకి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నా మన్నారు. అదేవిధంగా నేడు ప్రభుత్వం ఏర్పడి సంవత్సరకాలం సందర్భంగా ఒకటవ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు చదువుకుంటున్న బాల బాలికల ప్రతి ఒక్కరికి 15000 రూపాయలు తల్లుల అకౌంట్లో నేడు జమ చేయడం శుభ పరిణామం అన్నారు. ఈ కార్యక్రమంలో సులూరుపేట ఇంచార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం, మండల పార్టీ అధ్యక్షులు విజయ్ కుమార్ నాయుడు, ఆర్టీవో కిరణమై, ఎంపీడీవో విజయలక్ష్మి, ఎమ్మార్వో పద్మావతి సీనియర్ నాయకులు గంగ రెడ్డి, మధు రెడ్డి, రవీంద్ర రెడ్డి, డాక్టర్ దారా అంకయ్య, మన్మథరావు, భీమవరం ఉదయ్, పర్రి వెంకటరమణయ్య, సచివాలయ సిబ్బంది, కార్యకర్తలు పాల్గొన్నారు.



# గూడూరు డివిజన్

## వేటకు వేళాయే!

కోట,జూన్ 11 ప్రభాతవార్త : మత్స్యకారులకు జీవనాధారమైన సముద్రంలో వేట నిషేద కాలం ఈ నెల 15 తో ముగియనుంది. రెండు నెలల విరామం అనంతరం వేటకు వేళ్లేందుకు బోట్ల నిర్వాహకులు సిద్ధమవుతున్నారు.విరామ సమయంలో బోట్లు,వలలుకు మరమ్మతులు చేసుకున్నారు. ఇప్పటికే తీర ప్రాంతంలోని వలలతో పాటు నిత్యావసర సరకులను బోట్లు పడవలోల సర్దుకుంటున్నారు.గత రెండేళ్లగా మత్స్య సంపద చిక్కకపోడంతో నిరాశగా వెనుదిరిగారు. వేటకు వేళ్లేందుకు పెట్టుబడి అవుతుంది. నష్టంతో ఏడాదిలో సగానికి పైగా రోజులు మత్స్యకారులు వేట మానుకుని ఇళ్లకే పరిమితవుయ్యారు.ఈ ఏడాది కలిసి రావాలని గంగమ్మ తల్లికి పూజలు నిర్వహించుకుంటున్నారు.బుదవారం పౌర్ణమితో గంగమ్మకు మత్స్యకారులు పూజలు నిర్వహించారు

## కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి- ఏ.పి.మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్

గూడూరు, జూన్ 11 ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, కోరుతూ ఏ.పి.మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సి.ఐ.టి యు) అనుబంధం ఆధ్వర్యంలో రాష్ట్ర,జిల్లా కమిటీల పిలుపు మేరకు బుధవారం రోజు తిరుపతి జిల్లా గూడూరు మున్సిపల్ కమిషనర్ ఏ. వెంకటేశ్వర్లుకు సమ్మె నోటీసును అందజేయడం జరిగింది. మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు జీ.వో ఎం.ఎస్ నెంబర్ 11 తేది. 17/ 1/ 2012 ఆధారంగా కేటగిరీలు నిర్ణయించడం, జీవోఎంఎస్ నెంబర్ 36, తేది. 1/3/2024 ప్రకారం 21000 నుంచి రూ. 24,500 జీతాలు పెంచి చెల్లించాలి. జి.ఓ ఆర్ టి.నెంబర్ 16 15, 2013లో పేర్కొన్న విధంగా మున్సిపల్ ఇంజనీరింగ్, పారిశుద్ధ్య కార్మికులకు పి.ఆర్.సి జీతాలు, కరువు భత్యం ఐ.ఆర్, ఇంజనీరింగ్ కార్మికులకు టెక్నికల్, నాన్ టెక్నికల్ జీతాలు అమలు చేయాలన్నారు. 2018లో నాటి తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో ఇచ్చిన రాతపూర్వక ఒప్పందంలో సమాన పనికి సమాన వేతనం 2019 నుండి అమలు చేస్తానన్న ఒప్పందాన్ని అమలు చేయాలన్నారు. గత 17 రోజులు సమ్మె కాలపు ఒప్పందాలైన రిటైర్మెంట్ బెనిఫిట్స్, ఎక్స్ గ్రేషియా పెంపు, దహన సంస్కారాలకు రూ. 20,000 రూపాయిలు సంక్షేమ పథకాలు అమలు జీవోలు జారీ చేయడంతో పాటు రిటైర్మెంట్ అయిన, చనిపోయిన అనారోగ్యం పాలైన వారి స్థానంలో వారి పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వాలి, గ్రాడ్యుటి చెల్లించాలి, ఆప్కాస్ రద్దు చేస్తే కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలి, వయోపరిమితి 62 ఏళ్ళు పెంచాలి, చట్టబద్ధమైన సెలవులు అమలు చేయాలని, కిట్లు భద్రతా సౌకర్యాలు సకాలంలో అందించాలని. పై డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సమ్మె నోటీసులో తెలియపరుస్తూ లేనిపక్షంలో సమ్మెలోకి వెళ్లడం జరుగుతుందని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గూడూరు మున్సిపల్ కార్మిక సంఘం కార్యదర్శి ధారా కోటేశ్వరరావు, సి.ఐ.టి.యు పట్టణ అధ్యక్షులు బి.వి. రమణయ్య, పి.బాలాజీ, ఎస్.గిరి, బి.మురళి, ఏ.ప్రసాద్, బి.చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



## అంగన్‌వాడీ పిలుస్తోంది రండి

కోట, జూన్ 11 ప్రభాతవార్త: మూడేళ్ల నిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రంలో ప్రవేశ కల్పన, ఐదేళ్ల పూర్తి చేసుకున్న పిల్లలను ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో చేర్పించడమే ఏకైక లక్ష్యంగా అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమానికి కూటమి ప్రభుత్వం శ్రీకారంచుట్టింది. ఈ కార్యక్రమం ఈ నెలాఖరు వరకు జరుగుతుందని ఐసిడిఎస్ సిడిపిఓ మునికుమారి చెప్పారు. కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లోని అంగన్‌వాడీల పరిధిలో విస్తృతంగా అవగాహన ప్రచారం చేపట్టామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రయోజనాలు, విద్యాబోధన వంటి వాటిని వివరిస్తున్నామని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రంలో చేరితే మంచి ఆరోగ్యం, చదువు ఉంటుందన్న విషయాన్ని తల్లిదండ్రులకు తెలియజేయడానికి ప్రచార కార్యక్రమాలు చేపట్టామన్నారు. ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో మాదిరిగా ఫీజులు ఉండవని, ఇక్కడ చదువంతా పూర్తి ఉచితమని, శిక్షణ పొందిన అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు ఉంటారని తెలిపారు. పిల్లలకు వయస్సు ఆధారంగా ఆట, పాటలతో కూడిన విద్యాబోధన ఉంటుందన్నారు. ఉడికించిన గుడ్లు, మధ్యాహ్న భోజనం అందిస్తారని తెలిపారు. తెలుగు, ఆంగ్లం, గణితం బోధన, తెలుగు, ఆంగ్లం కథలు, రైమ్స్ నేర్పిస్తారని తెలిపారు. క్రమం తప్పకుండా ఎఎన్ఎంలతో టీకాలు, ఆరోగ్య పరీక్షలు ఉంటాయన్నారు.

## పండుగ వాతావరణంలో ఏరువాక కార్యక్రమం



వెంకటగిరి, జూన్ 11 ప్రభాతవార్త: జిల్లాలో ఏరువాక పౌర్ణమి కార్యక్రమం పండుగ వాతావరణం లో జరిగిందని జిల్లా వ్యవసాయశాఖ అధికారి పి.ప్రసాద్ రావు తెలిపారు. మండలంలోని మొగలకుంట గ్రామంలో మడక దున్ని ఏరువాక కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటలు సమృద్ధిగా పండి రైతులు సుఖసంతోషాలతో ఉండాలని తెలిపారు. రైతులకు ఎరువులు, విత్తనాలు సమృద్ధిగా ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తనుజరెడ్డి, ఎంపీడీవో గుణశేఖర్‌రెడ్డి, ఏడిఏ నాగార్జునసాగర్, ఏవోలు సుజాత, శిరీష, మండల పార్టీ అధ్యక్షుడు చంద్రమోళిరెడ్డిలు పాల్గొన్నారు.

## సమాచార శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా వేలాయుధం బాధ్యతలు స్వీకరణ



చిత్తూరు, జూన్ 11 ప్రభాతవార్త: చిత్తూరు జిల్లా పౌర సమాచార సంబంధాల శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా వేలాయుధం బుధవారం బాధ్యతలు స్వీకరించారు. పౌర సమాచార సంబంధాల శాఖలో ఇటీవల జరిగిన బదిలీల్లో తిరుపతి సమాచార శాఖసహాయ సంచాలకులుగా విధులు నిర్వహిస్తున్న వేలాయుధంను ప్రభుత్వం చిత్తూరు జిల్లా పౌర సమాచార సంబంధాల శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా బదిలీ చేసింది. అలాగే ఇక్కడ సమాచార శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న పద్మజను ప్రభుత్వం కడప జిల్లా పౌర సమాచార సంబంధాల శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా బదిలీ చేసింది. అలాగే చిత్తూరు జిల్లా డివిజనల్ పిఆర్ఓగా విధులు నిర్వహిస్తున్న రమణను అనంతపురం జిల్లాకు బదిలీ చేసింది.

## నేటి నుంచి ప్రభుత్వ పాఠశాలలకు 'సన్న బియ్యం'



శ్రీకాళహస్తి,జూన్ 11 ప్రభాతవార్త : కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి విద్యా వ్యవస్థను పటిష్టం చేయటానికి విన్నూత్న ప్రణాళికలతో ముందుకు వెళుతుంది. యువ నాయకుడు నారా లోకేష్ విద్యాశాఖ మంత్రి నేతృత్వంలో విద్యా విధానంలో పలు మార్పులు చేపడుతున్నారు. ఈ నేపధ్యంలో సిలబస్‌లో మార్పులతో పాటు పుస్తకాలు మోసే బాధను తొలగించటానికి టెక్స్ బుక్స్ రూప కల్పన చేసారు. అయితే ఇక ప్రభుత్వ పాఠశాలలో ముతకబియ్యంతో సరఫరా చేసే బియ్యానికి స్వస్తి చెప్పారు. నేటి నుంచి ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభం కానున్నాయి. ఇందుకు గాను మధ్యాహ్నం భోజన పథకానికి 'మేలైన సన్న బియ్యాన్ని' అందించుటకు సన్నాహాలు చేసారు.ఈ మేరకు సివిల్ సప్లైస్‌తో పాటు విద్యాశాఖకు ఆదేశించారు.

**సన్నబియ్యం సరఫరా:**

గురువారం నుంచి పునఃప్రారంభం కానున్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు తినటానికి రుచికరమైన భోజనం పెట్టడానికి ఆదేశించారు.ఈ మేరకు పాఠశాలలకు బియ్యాన్ని తరలిస్తున్నారు. సన్న బియ్యం బస్తాలకు క్యూఆర్ కోడ్ కల్గిన ట్యాగ్‌లను ఏర్పాటు చేసి దొడ్డిదారిన వెళ్ళకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకున్నారు.ఈ సందర్భంగా శ్రీకాళహస్తి విద్యాశాఖ అధికారి బాలయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది విద్యార్థులకు పౌష్టికాహారం అందించుటకు నిర్ణయం తీసుకుందన్నారు.రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ ఆదేశాల మేరకు మధ్యాహ్నం భోజనానికి మేలు రకం సన్న బియ్యాన్ని అందిస్తున్నట్లు వివరించారు. మండలంలోని అన్ని పాఠశాలలతో పాటు పట్టణంలోని పాఠశాలలకు అందిస్తున్నట్లు వివరించారు. 7 స్టాక్ పాయింట్ల నుంచి బియ్యం బస్తాలను అందిస్తున్నట్లు వివరించారు.బియ్యాన్ని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందించినట్లు వివరించారు. ప్రతిబియ్యం బస్తాకు క్యూఆర్ కోడ్‌తో సరఫరా చేసామని దానిని స్కాన్ చేసినన తరువాత వాటిని వినియోగించాలని తద్వారా ఏ బియ్యం ఏ పాఠశాలలో వినియోగించారో సమాచారం జిల్లా అధికారులకు పౌర సరఫరా అధికారులకు తెలియజేసేలా పిఆర్‌కోడ్ విధానాన్ని అమలు చేస్తున్నట్లు వివరించారు. సన్నబియ్యంతో పాటు విద్యార్థుల ఆరోగ్య రీత్యా కొడిగుడ్లు జోన్న, రాగిపిండి వివిధ రకాల పోషక పదార్థాలను పాఠశాలలకు అందజేస్తున్నట్లు వివరించారు.

## రాష్ట్రస్థాయి యోగాపోటీలకు ఎంపికైన తేజశ్రీ



కుప్పం, జూన్ 11 ప్రభాతవార్త : ఈనెల 16వతేది వైజాగ్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి యోగా పోటీలకు కుప్పం పట్టణం జెపి రోడ్డులో నివాసం ఉన్న శ్యామల, కృష్ణంరాజుల కుమార్తె తేజశ్రీ ఎంపికైంది. ఈనెల పదవ తేది జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో తేజశ్రీ ప్రతిభ చూపి రాష్ట్రస్థాయికి ఎంపికైంది. దీంతో కుప్పం మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు బుధవారం మున్సిపల్ కార్యాలయంలో తేజశ్రీని అభినందించారు. కార్యక్రమంలో ఆయుష్ డా॥ హేమలత, యోగా మాస్టర్ పవిత్ర పాల్గొన్నారు.

## ఏక్ ఫేడ్ మాకే నామ్

**-మొక్కలు నాటుదామన్న కేంద్రమంత్రి బండి**



తిరుపతి, జూన్ 11ప్రభాతవార్త : తిరుపతిలో బుధవారం ఉదయం ప్రధాని మోదీ 11 వసంతాలు పూర్తిచేసుకున్న కార్యక్రమంలో పాల్గొనేందుకు విచ్చేసిన కేంద్రహోంశాఖ సహాయమంత్రి బండిసంజయ్ మొక్కలునాటడంపై పిలుపు నిచ్చారు. గత 11సంవత్సరాల ప్రధాని మోదీ పాలనలో దేశంలో జరిగిన అభివృద్ధి, పలు ప్రాజెక్టులు నిర్మాణం, రాష్ట్రానికి వచ్చిన నిధులు, కొత్త ప్రాజెక్టులుపై ఏర్పాటుచేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను బండి ఆసక్తికరంగా తిలకించారు. తిరుపతి జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, జిల్లా సాంస్కృతిక విభాగం కన్వీనర్ గుండాల గోపీనాథరెడ్డి ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్రమోదీ పిలుపుమేరకు ఏక్ ఫేడ్ మాకే నామ్ అనే స్ఫూర్తితో దేశవ్యాప్తంగా మొక్కలునాటే కార్యక్రమం చేపడుతున్నామన్నారు. తిరుపతి పర్యటనలో తిరుపతి పోలీసు గ్రౌండ్‌లో జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజుతో కలసి మొక్కలు నాటడం ఆనందంగా ఉందన్నారు.

## తిరుపతి ఆర్టీఓ కార్యాలయం ఏఓగా విజయకుమార్

తిరుపతి(రవాణ),జూన్ 11ప్రభాతవార్త : తిరుపతి జిల్లా రవాణాశాఖ కార్యాలయం పరిపాలన అధికారిగా టి.విజయకుమార్ నియమితులయ్యారు. బుధవారం ఉదయం ఆయన కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఎం.శ్రీనివాసులు మదనపల్లి జిల్లా రవాణాశాఖ కార్యాలయంకు బదిలీపై వెళ్ళారు. వీరిద్దరి కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖాధికారి కొర్రపాటి మురళీమోహన్ పాల్గొని ప్రజలకు సేవలందించే విధానం తెలిపారు. తిరుపతి కార్యాలయంలో బాధ్యతలు చేపట్టిన విజయకుమార్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో సహాయక సంయుక్త రవాణ కమిషనర్ బి.కృష్ణవేణి, ఎంవిఐలు, జిల్లా కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## తిరుపతికి వంద ఎలక్ట్రికల్ బస్సులు

తిరుపతి(రవాణ),జూన్ 11ప్రభాతవార్త తిరుపతి జిల్లా ప్రజారవాణాశాఖ రిజియన్‌కు కొత్తగా 100 ఎలక్ట్రికల్ బస్సులు రానున్నాయి ఈబస్సులు తిరుమల,తిరుపతి,కడప,మదనపల్లి,చిత్తూరు ప్రాంతాల మధ్య నడవనున్నాయి.ఎలక్ట్రికల్ బస్సులతో ప్రయాణీకులు సుఖవంతమైన ప్రయాణం చేస్తున్నారని పిటిఓ ఉద్యోగులు చెబుతున్నారు. ఇప్పుడు కొత్తగా వస్తున్న ఎలక్ట్రికల్ బస్సులు ప్రజలకు మరింతగా సౌకర్యవంతంగా ఉంటాయన్నారు.

## 29న ఏఐటియుసి మహాసభలు



వెంకటగిరి, జూన్ 11 ప్రభాతవార్త: ఏఐటియుసి వెంకటగిరి నియోజకవర్గ మహాసభలు ఈనెల 29వ తేదీన వెంకటగిరిలో జరుగుతాయని వీటిని విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ మహాసభల సన్నాహక సమావేశాన్ని వెంకటగిరిలో నిర్వహించడం జరిగింది. ఈ మహాసభకు ముఖ్య అతిథులుగా ఏఐటియుసి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్ రెడ్డి, కే రాధాకృష్ణులు హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం దేశంలో బిజెపి నాయకత్వంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను శరవేగంగా అమలుపరుస్తున్నారని తెలిపారు.ఉద్యోగ భద్రత లేకుండా పోతుందని రాజకీయ వేదింపులు మరియు ఎక్కువ అవుతాయని అందుకు జూలై 9 వ తేదీన జరిగే సార్వత్రిక సమ్మెలో యావత్తు కార్మిక వర్గాన్ని కదిలించి పెద్ద ఎత్తున పాల్గొనాలని తెలిపారు. అందుకోసం జూలై 9వ తేదీన జరిగే సార్వత్రిక సమ్మె విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి బాలకృష్ణ. ఏఐటీయూసీ నియోజకవర్గ నాయకులు సిపిఐ టౌన్ సెక్రెటరీ శివ, వీధి విక్రధార సంఘం నాయకులు మునీంద్ర, మున్సిపల్ కార్మిక నాయకులు నరేష్. నాగేశ్వరరావు, సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులు, చంగల్రాయులుతదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా ఎరువులు తరలింపు



వాకాడు, జూన్ 11 ప్రభాతవార్త: మండలం బాలిరెడ్డిపాలెం గ్రామంలోని బుధవారం రైతు భరోసా కేంద్రం నుంచి తరలిస్తున్న అక్రమంగా ఎరువులు తరలిస్తున్నారని స్థానిక రైతులు మండిపడ్డారు. స్థానిక రైతులు వీడియో, ప్రకటన ద్వారా విలేకరులకు తెలియజేస్తూ బాలిరెడ్డి పాలెంలో రైతు భరోసా కేంద్రం నుంచి ప్రక్క మండలాలకు ఎరువులు ఎక్కువ రేటుతో విక్రయాలు జరిపి తరలిస్తున్నారు. సంబంధించిన అధికారులు పర్యవేక్షణ లోపం వల్ల వాళ్ళు ఇష్టం వచ్చిన విధంగా రైతుల నోళ్ళు కొడుతున్నారని బాలిరెడ్డి పాలెం రైతులు తీవ్రంగా ఖండిస్తున్నారు. స్థానికులకు ఎరువులు లేవంటూ రైతులు లబోదిబో ఆవేదన వ్యక్తం చేశారు. ఏవో దీపను వివరణ కోరగా అలాంటివి ఏమి జరగడంలేదని సూచించారు.

## తగిన మూల్యం చెల్లించక తప్పదు : నేదురుమల్లి



వాకాడు, జూన్ 11 ప్రభాతవార్త: ప్రభుత్వ వైఫల్యాలు, అక్రమాలు, అరాచకాలను ప్రశ్నిస్తున్న మీడియా గొంతు నొక్కాలని కుట్ర పన్నుతున్న కూటమి ప్రభుత్వం భవిష్యత్‌లో తగిన మూల్యం చెల్లించక తప్పదని వైసిపి వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం వాకాడులోని తన నివాసంలో వాకాడు, కోట, చిట్టమూరు మండలాల వైసిపి నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. డెబిట్ జరిగిన అదే రోజు ఆయనచే వివరణ ఇవ్వడం, క్షమాపణ చెప్పడం జరిగిందని, అయినా కక్షసాధింపు చర్యల్లో భాగంగా కూటమి ప్రభుత్వం కుట్ర పూరితంగా వ్యవహరిస్తుందన్నారు. రాష్ట్రంలో అంబేద్కర్ రాజ్యాంగం నడవడం లేదని, కేవలం లోకేష్ రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తుందన్నారు. రాష్ట్రంలో మహిళలకు రక్షణ, భద్రత కల్పించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, గత జగనన్న ప్రభుత్వంలో మహిళలకు గౌరవంతో పాటు అన్ని రంగాలలో పెద్ద పీట వేశారన్నారు. ఎవ్వరు అధైర్య పడొద్దని, పార్టీ అండగా ఉంటుందని నాయకులు, కార్యకర్తలకు రామ్ కుమార్ రెడ్డి భరోసా ఇచ్చారు.

## ముగిసిన సమ్మర్ క్రికెట్ క్యాంపు



గూడూరు, జూన్ 11 ప్రభాతవార్త : క్రికెట్ క్రీడ ద్వారా గూడూరు పట్టణానికి చెందిన అనేకమంది రాణించారని చిన్నతనం నుండి ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకొని దాన్ని సాధించేందుకు చిన్నారులు కష్టపడాలని గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ వెల్లడించారు. గూడూరు పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో నెల్లూరు డిస్టిక్ క్రికెట్ అసోసియేషన్ సహకారంతో 40 రోజులుగా జరిగిన సమ్మర్ క్రికెట్ కోచింగ్ క్యాంప్ ముగిసింది. ఈ ముగింపు సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే సునీల్ కుమార్ హాజరయ్యారు. శిక్షణ పొందిన చిన్నారులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లూరు ఆదిశేషా రెడ్డి ప్రభుత్వం స్టేడియంలో అనేక సంవత్సరాలుగా క్రికెట్ పోటీలు ముని గిరీష్ ఆధ్వర్యంలో జరిగాయని తెలిపారు. జిల్లాలో లేని విధంగా నెట్ ప్రాక్టీస్ ఇక్కడ జరుగుతుందని గుర్తు చేశారు. గూడూరు క్రీడాకారులు జిల్లా స్థాయిలో కూడా రాణించాలని స్టేడియంలో క్రీడాకారులకు కావాల్సిన అన్ని వసతులు ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాజశేఖర్ రెడ్డి, దశరథ రామిరెడ్డి, ముని గిరీష్, వేగూరు రాజేంద్ర ప్రసాద్, నాగేశ్వరరావు, లవ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



గూడూరు, జూన్ 11 ప్రభాతవార్త : విద్యార్థులు క్రీడల్లో రాణించాలని ప్రగతి సేవా సంస్థ అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్ పేర్కొన్నారు. బుధవారం ఎస్. కె.ఆర్ ప్రభుత్వ కళాశాలలో నేషనల్ సమ్మర్ క్యాంప్ స్పోర్ట్స్ ముగిసింది. క్రికెట్ వాలీబాల్ కోకో కబడ్డీ రన్నింగ్ , యోగ, ఉచిత శిక్షణ ఇచ్చారు. ఈ ముగింపు కార్యక్రమంలో ప్రగతి సేవా సంస్థ అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్, పిడి నారాయణరాజు విచ్చేసి విన్నర్స్‌కి మెడల్స్, సర్టిఫికెట్లును అందచేశారు. ఈ సందర్భంగా ప్రగతి సేవా సంస్థ అధ్యక్షులు చంద్రశేఖర్ మాట్లాడుతూ క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలో, జాతీయస్థాయిలో రాణించాలన్నారు.

## తొలిరోజే విద్యార్థి మిత్ర పంపిణీ

కోట, జూన్ 11 ప్రభాతవార్త : పాఠశాలల ప్రారంభం రోజునే విద్యార్థి మిత్ర ఇవ్వాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. 2025-25 విద్యా సంవత్సరానికి సంబంధించి సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లు మండలంలోని 77 పాఠశాలలకు అందజేస్తున్నట్లు ఎంఇఓ మస్తానయ్య చెప్పారు. ఆయన 'ప్రభాతవార్త'తో మాట్లాడుతూ పాఠశాలలో పునఃప్రారంభం నుంచే ప్రతి విద్యార్థికి పుస్తకాలు, బెల్టు, నోటు పుస్తకాలతో పాటు పాఠ్య పుస్తకాలు అందించేలా అన్ని చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. విద్యార్థి మిత్ర కింద ఉచితంగా ఇస్తున్నట్లు తెలిపారు. విద్యార్థి మిత్రకు సంబంధించిన వస్తువులు ఇప్పటికే అన్ని పాఠశాలలకు చేర్చామన్నారు. వీటిని విద్యార్థుల తల్లిదండ్రుల కమిటీల సమక్షంలో విద్యార్థులకు అందజేస్తామన్నారు.

## రైతులను విస్మరించిన వైసిపి ప్రభుత్వం : ఎమ్మెల్యే



వెంకటగిరి, జూన్ 11 ప్రభాతవార్త : గత ప్రభుత్వంలో ఎలాంటి పనిముట్లు ఇవ్వకుండా రైతులను పూర్తిగా విస్మరించారని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. వెంకటగిరి మండలం పెట్లూరు గ్రామంలో 20 లక్షల రూపాయలతో నిర్మించిన సిమెంట్ రోడ్లను ప్రారంభించి, వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి మండలాల్లోని రైతులకు నాలుగు డ్రోన్లను పంపిణీ చేశారు. మొగలగుంట గ్రామంలో ఏరు ఒక కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న రైతులకు సబ్సిడీ ధరలకు విత్తనాలు వ్యవసాయ పనిముట్లు ఇస్తున్నట్లు తెలిపారు. తెలుగుదేశం ప్రభుత్వం ఎప్పుడు రైతుల పక్షపాతిగా ఉంటుందని చెప్పారు. డ్రోన్ స్ప్రేయర్ల ద్వారా రైతులు పంటలకు పురుగుల నివారి మందులు పిచికారి చేసుకోవచ్చు అని తెలిపారు. మెన్ పవర్ తో సంబంధం లేకుండా వ్యవసాయానికి అన్ని రకాల పనిముట్లు వస్తున్నట్లు తెలిపారు. తిరుపతి జిల్లా వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ ప్రసాద్ రావు మాట్లాడుతూ రైతులు వ్యవసాయ రంగంలో అధునాతన పద్ధతులు పాటించాలని తెలిపారు. ఎంపీపీ తనుజా రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమ ధ్యేయంగా పనిచేస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ ఏడి నాగార్జునసాగర్, పంచాయతీరాజ్ డిఇ లక్ష్మీనారాయణ, ఎంపీడీవో గుణశేఖర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు చంద్రమోళి రెడ్డి, కోటేశ్వర్ రెడ్డి, ఏవోలు సుజాత, శిరీష, తదితరులు పాల్గొన్నారు.

## చెందోడులో ఆధార్ సెంటర్ ప్రారంభం

కోట, జూన్ 11 ప్రభాతవార్త : మండలం చెందోడు గ్రామంలో బుధవారం ఆధార్ కేంద్రాన్ని ఎంపిడిఓ దిలీప్‌కుమార్ ప్రారంభించారు. ఈ కేంద్రం పరిధిలోని గూడలి-1, గూడలి-2, కేశవరం గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అన్ని పథకాలు వర్తించాలంటే ఆధార్ కార్డు తప్పనిసరి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కిరణ్‌కుమార్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

## వైద్య రంగాన్ని నిర్వీర్యం చేసిన వైసీపీ ప్రభుత్వం : ఎమ్మెల్యే



వెంకటగిరి, జూన్ 11, ప్రభాతవార్త : గత వైసిపి ప్రభుత్వంలో పేదలకు సరైన వైద్యం అందక మృత్యువు పాలు పడ్డారని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. వెంకటగిరిలోనే ఆయన నివాస గృహంలో పలువురికి సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న సీఎం సహాయనిధి చెక్కులను వైద్యం చేయించుకున్న వారికి సీఎం చంద్రబాబు నాయుడు వెంటనే సహాయనిధి చెక్కులను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. పేదలు ఆరోగ్యంగా ఉండేందుకు వైద్యానికి ఎంతైనా ప్రభుత్వం ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు చంద్రమోళి రెడ్డి, కోటేశ్వర్ రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## మండల అభివృద్ధికి ప్రభుత్వ సహకారం : కలెక్టర్



తవణంపల్లె, జూన్ 11 ప్రభాతవార్త: మండల అభివృద్ధికి ప్రభుత్వం నుండి సహకారం వుంటుందని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని ఎ.గొల్లపల్లెలో పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్‌తో కలసి గ్రామంలో అర్హులైన 47 మంది పేదలకు ఇళ్ళ పట్టాలను మంజూరు చేశారు. అలాగే గ్రామ పంచాయతీ పరిధిలో పలు అభివృద్ధి పనులను ప్రారంభోత్సవం చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామంలో అర్హులను గుర్తించి ప్రభుత్వ రికార్డులను పరిశీలించి ఇంటి పట్టాలను మంజూరు చేయడం జరిగిందన్నారు. అలాగే గ్రామానికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ మాట్లాడుతూ ఎ.గొల్లపల్లె గ్రామంలో గత 25 ఏళ్ళు నుండి ఇళ్ళ పట్టాలు లేని వారిని గుర్తించి 47 మందికి ఇళ్ళ పట్టాలను మంజూరు చేయడం ద్వారా ఇల్లు నిర్మించుకుని పట్టా పొందని వారికి ఇంటి పట్టా మంజూరు చేయడంతో ఇల్లు పూర్తిగా వారి సొంతమవుతుందన్నారు. సొంత ఇల్లు సమాజంలో వారి విలువను పెంచడంతో పాటు కష్టకాలంలో అండగా వుంటుందన్నారు. ముఖ్యంగా ఎస్సీ సామాజిక వర్గ అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అలాగే గ్రామస్థుల కోరిక మేరకు స్మశానానికి భూమి కేటాయించడం జరిగిందన్నారు.

**ఏరువాక పౌర్ణమి కార్యక్రమం ప్రారంభం:**

ఎ.గొల్లపల్లె గ్రామంలో ఏరువాక పౌర్ణమి కార్యక్రమను జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, పూతలపట్టు ఎమ్మెల్యే కలికికి మురళీమోహనలో లాంచనంగా ప్రారంభించారు. ఈసందర్భంగా గ్రామ సమీపంలోని రైతుల పొలంలో సంప్రదాయబద్ధంగా భూమాతకు, నాగలికి ఎద్దులకు ప్రత్యేకపూజలు నిర్వహించిన అనంతరం దుక్కి దున్ని ఏరువాక పౌర్ణమిని ప్రారంభించి ప్రస్తుత వ్యవసాయ సీజన్‌ను ప్రారంభించారు.అలాగే వడ్డిపల్లె గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిని సీసీ రోడ్డును కలెక్టర్, ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈకార్యమ్రకంలో జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ, పీఆర్ డిఈ ప్రసాద్‌నాయుడు, స్థానిక సర్పంచ్ సబిత ప్రవీణ్,తహశీల్దార్ సుధాకర్, మండల ఉద్యాన అధికారి సాగరిక, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ చౌదరి, క్లస్టర్ ఇన్‌చార్జిలు తెల్లగుండ్లపల్లె మోహన్‌నాయుడు, సునీల్ చౌదరి, బంగారుపాళ్యం ఏఎంసీ ఛైర్మన్ భాస్కర్‌నాయుడు,గోపీ యాదవ్, కోదండయ్యలతో పాటు పలువురు నాయకులు,అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఆటోనగర్‌ను పరిశుభ్రంగా ఉంచండి : కమిషనర్



తిరుపతి కార్పొరేషన్, జూన్ 11 ప్రభాతవార్త : ఆటోనగర్ లోని వాహనాలు మరమ్మతులు చేసే ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య దుకాణ దారులను ఆదేశించారు. బుధవారం ఉదయం ఆటోనగర్ లోని వాహనాలు మరమ్మతులు నిర్వహించే ప్రాంతాలను నగరపాలక సంస్థ, ఐలా అధికారులతో కమిషనర్ పరిశీలించారు. పలు చోట్ల ఎక్కడపడితే టైర్లు, వాహనాల విడి భాగాలు పడేసి అపరిశుభ్రంగా ఉండడంతో కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ప్రధాన ప్రాంతం అయిన ఆటో నగర్ అపరిశుభ్రంగా ఉండకుండా తగు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎక్కడపడితే అక్కడ చెత్త వేసినా, అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాల్లోని దుకాణదారులకు అపరాధ రుసుము విధించాలని అధికారులను ఆదేశించారు. చెత్త కాల్చడం వంటివి చేయకుండా చూడాలని అన్నారు. ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలను తొలగించాలని అన్నారు. స్థానికులు, దుకాణదారుల కోరిక మేరకు డ్రైనేజీ కాలువలు నిర్మాణం, రోడ్ల ఏర్పాటుకు పరిశీలన చేస్తామని అన్నారు. కమిషనర్ వెంట ఐలా కమిషనర్ రాంబాబు, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజనీర్ గోమతి, హెల్త్ ఆఫీసర్ యువ అన్వేష్, ఏసీపీ బాలాజీ, డి.ఈ.లు రమణ,శిల్ప తదితరులు ఉన్నారు.